ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 7, అక్టోబరు 2025

స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవం ఒంగోలులోని రిమ్స్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాస్థాయిలో అవార్డులు సాధించిన 49 మందికి కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇతర ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సమాజం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 4



జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డులు అందుకున్న వారితో ప్రజాప్రతినిధులు అధికారులు

ఘనంగా స్వచ్ఛ పురస్కారాల ప్రదానం



జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు దక్కాయి. విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. స్వచ్ఛ గ్రామపంచాయతీ విభాగంలో చీమకుర్తి మండలం ఆర్ఎల్‌పురంనకు దక్కిన రాష్ట్రస్థాయి అవార్డును డీపీవో వెంకటేశ్వరరావుతోపాటు ఆ పంచాయతీ సర్పంచ్ రమణమ్మ, కార్యదర్శి నరేంద్ర, అందుకున్నారు. స్వచ్ఛ ఆసుపత్రి విభాగంలో చీమకుర్తి సీహెచ్‌సీకి లభించిన అవార్డును అక్కడి సూపరింటెండెంట్ అయిన డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తీసుకున్నారు. స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ఎస్ విభాగంలో వచ్చిన వార్డును మెప్మా పీడీ శ్రీహరి, కనిగిరిలోని వీరబ్రహ్మేంద్ర మహిళా సమాఖ్య ప్రతినిధి కేతినేని సుశీల అందుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కలెక్టరేట్

రుణం కోసం నిరీక్షణ

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అంటూ హడావుడి చేశారు. దరఖాస్తులు స్వీకరించారు. యూనిట్లను ప్రకటించారు. లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి చేశారు. వారికి ప్రభుత్వం నుంచి రుణ మంజూరు ఉత్తర్వులు కూడా అందజేశారు. ఆతర్వాత ముఖం చాటేశారు. నెలల తరబడి రుణాలు అందజేయకుండా లబ్ధిదారులను నిరాశకు గురిచేస్తున్నారు. తొలుత ఎందుకు అంత హడావుడి చేశారో... తీరా మంజూరు ఉత్తర్వులు ఇచ్చి యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు విడుదల చేయకుండా ఎందుకు మిన్నకున్నారో అర్థం కాక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. అటు బ్యాంకులు, ఇటు బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మంజూరు ఉత్తర్వులు ఇచ్చారు.. యూనిట్ల గ్రౌండింగ్ మరిచారు

- జిల్లాలో 2,050 మంది లబ్ధిదారులు
- ప్రభుత్వ తీరుతో అంతా అయోమయం
- నెలల తరబడి ఎదురుచూపులు
- బ్యాంకులు, బీసీ కార్పొరేషన్ చుట్టూ ప్రదక్షిణలు
- సబ్సిడీ సొమ్ము విడుదల కాలేదని సమాధానం


ఒంగోలు ప్రగతిభవన్‌లోని బీసీ కార్పొరేషన్ కార్యాలయం



ఒంగోలునగరం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించేందుకు అవసరమైన ప్రక్రియ అంతా పూర్తి చేసింది. యూనిట్ల గ్రౌండింగ్ విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో లబ్ధిదారులు తమకు ప్రభుత్వం ఇచ్చిన మంజూరు ఉత్తర్వులు చేతపట్టుకుని అటు బ్యాంకులు, ఇటు బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిరుగుతూనే ఉన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. మన జిల్లాకు సంబంధించి ఎనిమిది కార్పొరేషన్ల ద్వారా రుణాలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. బీసీ కార్పొరేషన్‌తోపాటు కాపు, రెడ్డి, కమ్మ, బలిజ, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించింది.

ఏప్రిల్ 11న మంజూరు ఉత్తర్వులు

ఫిబ్రవరి, మార్చి మాసాల్లో దరఖాస్తులు స్వీకరించిన వారిలో అర్హత ఉన్న 2,050 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఏప్రిల్ 11వ తేదీన జిల్లా కేంద్రంలో రుణ మేళా ఏర్పాటు చేసి మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఒంగోలు కలెక్టరేట్‌లో యూనిట్ల ప్రదర్శన ఏర్పాటు చేసి లబ్ధిదారులను వందల సంఖ్యలో సమీకరించి మంజూరు లేఖలు అందజేశారు. ఈ కార్యక్రమానికి

మిగతా 4వ పేజీలో

ఈక్రాప్ నమోదుకు గడువు పెంపు

- ఈ నెల 25 వరకు అవకాశం
- 30లోపు ఆర్ఎస్‌కేలలో జాబితాలు
- ఇప్పటివరకు 48.98శాతం నమోదు
- అత్యధికంగా మద్దిపాడులో 80 శాతం
- పలు మండలాల్లో వెనుకబాటు

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత సీజన్ ముగిసే సెప్టెంబరు 30 వరకే గడువు ఇచ్చింది. అయితే సగం విస్తీర్ణం వివరాలు కూడా నమోదు కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండటంతో ఈనెల 25 వరకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వపరంగా రైతులకు ఇచ్చే రాయితీలు, ఇతరత్రా అన్ని విషయాల్లోనూ ఈక్రాప్ నమోదు ప్రధానమైనదన్న విషయం విదితమే. గతంలో కేవలం పంటల సాగు విస్తీర్ణాన్ని మాత్రమే ఈ క్రాప్ నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి పంటలు సాగు జరిగినా, లేకపోయినా.. ప్రభుత్వ, బీడు భూములు అయినా ఒక్క ఫారెస్టు భూమి మినహా సర్వే నంబరు కేటాయించిన అన్నిరకాలను ఈ పంట నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో వెబ్‌ల్యాండ్ ప్రకారం మొత్తం 15,36,444 ఎకరాల భూమి ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. ఆ మేరకు


ముండ్లమూరులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు(ఫైల్)

మిగతా 4వ పేజీలో

మహిళా మార్ట్‌లో అవినీతిపై నేడు విచారణ

- హాజరుకావాలని పలువురు ఉద్యోగులకు నోటీసులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలులోని మహిళా మార్ట్‌లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ జరగనుంది. పొదుపు సభ్యుల భాగస్వామ్యం, దాతల సహకారంతో సుమారు రూ.68లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. అందులో భారీగా అవినీతి, నగదు దోపిడీ జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్‌తేజ్ స్పందించారు. విచారణ కమిటీని నియమించారు. ఆ మేరకు నెల్లూరుకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి బృందం విచారణ ప్రారంభించింది. గత నెలలో ఒంగోలు వచ్చిన విచారణ కమిటీ పలు రికార్డులు స్వాధీనం చేసుకుంది. మంగళవారం చేపట్టబోయే విచారణకు మార్ట్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన సీఎం ఎంలు, సీవోలు, ఐబీలు, సిబ్బంది హాజరుకావాలని ఆదేశించింది. దీంతో మెప్మాలో పనిచేసి బదిలీపై వెళ్లిన వారితోపాటు, ప్రస్తుతం ఉన్న వారిలో 30మందికిపైగా సిబ్బంది ఉదయం 11 గంటలకు ఒంగోలులోని కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని పీడీ శ్రీహరి నోటీసులు జారీ చేశారు.


లక్ష్మయ్య మృతదేహం


కొండల రాజు మృతదేహం

ఎదురొచ్చిన మృత్యువు

108 వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

- పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లి వద్ద ఘటన
- ఇరువురూ రామచంద్రకోట వాసులు

పెద్దారవీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎస్.కొత్తపల్లి పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దోర్నాల మండలం రామచంద్రకోటకు చెందిన బొమ్మనబోయిన కొండలరాజు (18), ధనంకుల లక్ష్మీనారాయణ (23) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై సోమవారం ఉదయం మార్కాపురం వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. పెద్దారవీడు, ఎస్.కొత్తపల్లి మధ్య మూలమలుపులో వారి బైక్‌ను ఎదురుగా వస్తున్న 108 వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కొండలరాజు, లక్ష్మయ్య 10వ తరగతి వరకూ చదువుకొని గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎస్ఐ సాంబశివయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.


సంబంధిత అధికారి రాకపోవడంతో కిందిస్థాయి సిబ్బందిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ రాజాబాబు

'మీకోసం'కు గైర్హాజరుపై కలెక్టర్ సీరియస్

సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్వోకు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు జిల్లా అధికారులు పలువురు గైర్హాజరు కావడంపై కలెక్టర్ పి.రాజాబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ కొంతమంది అధికారుల స్థానంలో ఆ శాఖకు చెందిన ఇతర ఉద్యోగులు హాజరుకావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శాఖల వారీగా ఆయా అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేశును ఆదేశించారు. ఆవిధంగా ఏడెనిమిది శాఖల అధికారులు మీకోసం కార్యక్రమానికి హాజరుకాలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

మైనర్‌లతో వెట్టి!

- తల్లిదండ్రులు అప్పు తీర్చలేదని వారి కుమార్తెల నిర్బంధం
- రాష్ట్రం మొత్తం తిప్పి వారితో బాతుల పెంపకం
- స్వచ్ఛంద సంస్థ చొరవతో ఇద్దరికీ విముక్తి
- కలెక్టర్ ఎదుట హాజరుపర్చి బాలసదన్‌కు తరలింపు
- చోద్యంచూసిన ఐసీడీఎస్ అధికారులు

వివరాలు మెయిన్‌లో..

పిడుగుపాటుకు బాతుల పెంపకందారుడు మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు బాతుల పెంపకందారుడు మృతి చెందిన ఘటన ఒంగోలు శివారులో చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా గుడ్లూరుకు చెందిన దేవరకొండ నాగరాజు (37) కుటుంబ సభ్యులతో కలిసి బాతులు మేపుకునేందుకు ఒంగోలు వచ్చి ఎస్.అగ్రహారం సమీపంలో గుడారాలు వేసుకొని ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గుడారంలో నిద్రిస్తున్న నాగరాజుకు సమీపంలో పిడుగు పడటంతో ఆయన మృతి చెందారు. ఈ మేరకు ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేశారు.


కర్నూలు రోడ్డులో చేరిన వర్షపు నీరు

ఒంగోలులో కుండపోత

- గంటకుపైగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- నగర సమీప ప్రాంతాల్లో పిడుగులు.. వణికిపోయిన ప్రజలు
- తటాకాలను తలపించిన రోడ్లు
- శివారు కాలనీలు జలమయం
- ప్రజల అవస్థలు

5

ఇసుక రవాణాపై పోలీసు ఆంక్షలు

- ఓవర్ లోడ్ పేరుతో కేసులు నమోదు చేస్తున్నారు!
- 'మీకోసం'లో కలెక్టర్‌ను కలిసిన ట్రాక్టర్ల యజమానులు
- స్టాక్ యార్డుకు నోటీసు ఇచ్చిన మైనింగ్ అధికారులు


కలెక్టర్‌ను కలిసేందుకు ఒంగోలులోని ప్రకాశం భవన్‌కు వచ్చిన ఇసుక ట్రాక్టర్ల యజమానులు

5



శనగలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

4వ పేజీలో

- క్వింటాకు రూ.10 వేలు దక్కకపోతే ప్రభుత్వమే రూ.3వేలు బోనస్ ప్రకటించాలి
- దేశీయ పంట ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి
- రైతు సంఘాల నేతల డిమాండ్
- ఒంగోలులో కలెక్టరేట్ వద్ద ధర్నా

'మీకోసం'.. అధికారుల మోసం..!

- కార్యక్రమానికి రాకుండానే తహసీల్దార్, ఆర్ఐ సంతకాలు
- మండలంలో అధికారులు లేనట్లేనా?
- తూతూమంత్రంగా అర్జీల స్వీకరణ

5

తీరంలో యువతి అనుమానాస్పద మృతి


శాంతికుమారి మృతదేహం

చినగంజాం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : సముద్రస్నానానికి వెళ్లిన యువతి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని మోటుపల్లి సముద్రతీరం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల మండలం అడవి పంచాయతీ పరిధిలోని అడవిపల్లెపాలెం గ్రామానికి చెందిన ఓసిపిల్లి రాజు, శాంతికుమారి(29)లు భార్యాభర్తలు. వీరికి 13 సంవత్సరాల కుమార్తె, 12 సంవత్సరాల కుమారుడు ఉన్నారు. రాజు చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు చేపల వేటకు వెళుతూ నాలుగురోజుల క్రితం వేటపాలెం మండలం పాతరెడ్డిపాలెం గ్రామంలోని శాంతికుమారి చెల్లెలు దీన ధనమ్మ నివాసంలో భార్య, పిల్లలను వదలి వెళ్లాడు. అడవిపల్లెపాలెంలోని చర్చిలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన సలగల వినమ్ ఫాదర్‌గా ఉన్నాడు. శాంతికుమారి కూడా ఆ చర్చికి వెళ్తుంటుంది. ఈ క్రమంలో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. శాంతికుమారి వేరే సెల్‌ఫోన్ నుంచి వినయ్‌కి ఫోన్ చేస్తూ ఉంటుంది. సోమవారం ఇద్దరూ కలిసి మోటుపల్లి సముద్ర తీరప్రాంతానికి వెళ్లారు. ఇరువురు కొంత లోతుకు వెళ్లారు. వినయ్ బయటకు వచ్చినప్పటికీ, అలలలో చిక్కుకొని శాంతకుమారి మృతి చెందింది. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాంతికుమారి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పొన్నలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పొన్నలూరు మండలం కనిగిరి నుంచి కందుకూరు వైపు వెళుతున్న మినీ ట్రక్కును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 20 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించగా, వారు దర్యాప్తు చేసి రేషన్ బియ్యంగా నిర్ధారించారని ఎస్‌ఐ అనుక్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ దొంగిలించిన కేసులో మూటా నవీన్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎస్.కోమలివల్లి సోమవారం తీర్పు చెప్పారు. సంతనూతలపాడులో 2022 ఆగస్టు 14 రాత్రి రోడ్డు పక్కన పార్కు చేసి మందాడి సత్యనారాయణ నిద్రపోయాడు. దీంతో గుర్తుతెలయని వ్యక్తులు మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈమేరకు సత్యనారాయణ సంతనూతలపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా ఒంగోలు జయప్రకాష్ కాలనీలో నివాసం ఉండే మూటా నవీన్ మోటార్ సైకిల్ దొంగిలించినట్లు గుర్తించారు. అతనివద్ద మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసి కోర్టులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణకుమార్ తమవాదనలు వినిపించారు.నవీన్‌పై దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సీపీవోగా సుధాకర్‌రెడ్డి


సుధాకరరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అర్థికగణాంక అధికారి(సీపీవో)గా సుధాకర్ రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ సిటీస్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. సీపీవోగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డిని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

శనగలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

క్వింటాకు రూ.10 వేలు ఇవ్వకుంటే ప్రభుత్వమే రూ.3వేలు బోనస్ ప్రకటించాలి

దేశీయపంటల ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి


ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : శనగ పంటకు క్వింటాకు రూ.10వేలు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో క్వింటాకు రూ.3వేలు బోనస్ ప్రకటించాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఏపీ రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నాలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రెండేళ్లుగా శనగ పంటకు గిట్టుబాటు ధరలు లేక కోల్డ్ స్టోరేజీల్లో 91వేల టన్నులు నిల్వ ఉన్నాయన్నారు. గత ఏడాది రూ.10వేల వరకు ధరలు కలిగినా కొనుగోలు మాత్రం నామమాత్రంగానే జరిగాయని చెప్పారు. క్వింటా పంట ఉత్పత్తి ఖర్చు రూ.7వేలపైనే ఉందన్నారు. క్వింటా శనగలు రూ.10వేలకు అమ్ముకుంటేనే కౌలు రైతు పరిస్థితి ఒక రకంగా ఉంటుందని తెలిపారు. ధరలు లేకపోవడంతో రైతులు రోడ్డునపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎగుమతి, దిగుమతి విధానం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కోరారు. రాష్ట్రంలో ఒక దశ, దిశలేకుండా పాలన సాగుతోందని విమర్శించారు. రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఈ ఏడాది బర్లీ రైతులు, వర్జీనియా పొగాకు రైతులు, శనగ, మిర్చిరైతులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ పంటకు సరైన ధరలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ రాజాబాబును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు పరిటాల కోటేశ్వరరావు, పలు రైతు సంఘాల నాయకులు, రైతులు ఉన్నారు.

సంతలకు ఆదరణ అదరహో


కూరగాయలు కొంటున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి) : పాత రోజుల్లో అనేక గ్రామాలలో, పట్టణాలలో వారానికో రోజు సంత జరుగుతుండేది. ఆ రోజు వివిధ ప్రదేశాల నుంచి నిత్యావసరాలు, రైతులు తమ పొలాల్లో పండిన కూరగాయలు తెచ్చి సంతలో అమ్ముతుండేవారు. ప్రజలు సంతకు వెళ్లి వారానికి సరిపడా కూరగాయలు కొనే వారు. ఇప్పుడు ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని కొన్ని పట్టణాలలో ఇదే తరహాలో సంతలునడుస్తున్నాయి. పల్లెటూళ్ల నుంచి వివిధ రకాల కూరగాయలను మినీ ట్రక్కులలో తెచ్చి వారానికి ఒక రోజు లేదా రెండు రోజులు అమ్మకాలు సాగిస్తున్నారు. చాలామంది ఒకే ప్రదేశంలో వారు ఎంచుకున్న రోజులలో కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలో సోమ, శుక్రవారం సాయంత్ర సమయాలలో ఈ విధమైన అమ్మకాలు ఉంటాయి. ఇక్కడ మరొక విశేషం ఏమిటంటే ఏ రకం కూరగాయలైన ఒకే ధరకు విక్రయిస్తున్నారు. అదే మార్కెట్‌కు లేదా రైతుబజార్‌కు వెళితే ఒక్కో రకం కూరగాయలకు ఒక్కో ధర ఉంటుంది. ప్రస్తుతం ఇలా రోడ్డు పక్కన అమ్మకాలు సాగించేవారు ఏ రకమైనా కిలోకి ఒకే ధర నిర్ణయిస్తారు. కావలసిన కూరగాయలన్నింటినీ ఆ కవర్లో వేసుకుని తూకం పెడతారు. ఎన్ని కిలోలు ఉంటే ఆ రోజు ధరను బట్టి డబ్బులు చెల్లించటమే. ఒంగోలు నగరంలో దక్షిణ బైపాస్, ఉత్తర బైపాస్, మామిడిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టుపక్కల ఇటువంటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలు సైతం ఇంటికి వెళ్లేటప్పుడు వీటిని కొని తీసుకు వెళ్తున్నారు. ఇలా విక్రయాలు చేసేవారికి షాపుల అద్దెలు, కరెంటు బిల్లులు లేకపోవటంతో వారు మార్కెట్, రైతుబజార్ కన్నా తక్కువ ధరకు ఇస్తున్నారు.

బాగుపడే 'దారేదీ'

- కొండపి నుంచి అనకర్లపూడి వరకు రోడ్డు అధ్వానం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- వాహనదారులకు అవస్థలు


అధ్వానంగా కొండపి నుంచి అనకర్లపూడి రోడ్డు


అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు గోతులమయమైన రోడ్డు

కొండపి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డు నరకప్రాయంగా మారింది. గోతులమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా కొండపి నుంచి అనకర్లపూడి వరకు మూడు కిలోమీటర్లు రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. తారురోడ్డు పూర్తిగా దెబ్బతినడంతోపాటు మార్జిన్లు కూడా గోతులమయమై ఎదురెదురు వాహనాలు ఎటువెళ్లాలో తెలియని దుస్థితి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు మరీ దారుణం

అలాగే అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు 2 కి.మీ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఈరోడ్డులో చీమకుర్తి ప్రాంతం నుంచి భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. ఆ వాహనదారులు తమ సౌకర్యం కోసం.. దెబ్బతిన్న రోడ్డ మార్జిన్లు దొరికిన మట్టిని పోసి గోతులు పూడ్చారు. ఆ మట్టి వర్షాలకు బురదగా మారింది. వాహనాల టైర్ల తిరుగుతుండడంతో రోడ్డుపై గాడులు పడి, వాహనదారులకు మరింత అసౌకర్యం కలిగిస్తున్నాయి. ప్రధానంగా భారీ వాహనం ఎదురు వచ్చినపుడు మార్జిన్ దిగిన మోటార్‌సైకిల్ టైర్లకు మట్టి చుట్టుకుపోయి పడిపోతున్నారు. నెలరోజుల కిందట ఓ ద్విచక్ర వాహనదారుడు బస్సు కన్నా ముందుకు వెళ్లాలని మార్జిన్‌లోకి దిగి తిరిగి రోడ్డు ఎక్కబోయి అదుపు తప్పి బస్సుకింద పడిపోయి ప్రాణాలు విడిచాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈరోడ్డులోని గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వచ్ఛ సమాజం సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఘనంగా స్వచ్ఛ పురస్కారాలు ప్రదానోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, వేదికపై ఎమ్మెల్యే దామచర్ల, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతను జీవన విధానంగా సమాజం మార్చుకునేందుకు ఉద్యమ స్థాయిలో ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఒంగోలులోని జీజీహెచ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేస్తోందన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ అవార్డులను అందజేస్తుందని చెప్పారు. ఈ క్రమంలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మూడు, జిల్లా స్థాయిలో 49 అవార్డులు లభించాయన్నారు. సింగపూర్ ప్రసిద్ధి చెందడానికి స్వచ్ఛతే ప్రధాన కారణమని కలెక్టర్ చెప్పారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వచ్ఛతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్రలో ఈ వేస్‌లో ఒంగోలు కార్పొరేషన్‌కు ఇటీవల అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకతను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ మన ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కంకణబద్దులు కావాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రత, మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతతో పరిసరాల పరిశుభ్రతతోపాటు ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందన్నారు. అనంతరం అవార్డులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, స్వర్ణాంధ్ర ఆవిష్కరణపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన గీతాన్ని గాయకుడు నూకతోటి శరత్‌బాబు స్వర కల్పన చేసి ఆలపించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో పురస్కారాల ప్రదానోత్స కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, డీఆర్వో చిన ఓబులేశ్, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అమరావతిపై పాట ఆవిష్కరణ

రాజధాని అమరావతిపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన పాటను కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత ఆవిష్కరించారు. గాయకులు నూకతోటి శరత్ ఆలపించగా, కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, అమరావతి రాజధానిపై రచించిన గీతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అంకితమిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

'జీవనజ్యోతి బీమా' సొమ్ము అందజేత

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బీమా పథకాలలో నమోదు చేసుకోవాలని బల్లికురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ శీనానాయక్ కోరారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన బండారు బ్రహ్మయ్య అను రైతు స్థానిక బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో నమోదై ఉన్నారు. అయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బీమా పథకం ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును మృతుని భార్య అరుణకు బ్యాంకు మేనేజర్ అందించారు. ఈసందర్భంగా అయన బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు బిందుమాధవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.


బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ కిటకిట

అద్దంకి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు కుటుంబ సభ్యులతో స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోయాయి. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం నుంచే రద్దీ మొదలైంది. సోమవారం ప్రయాణికులు మరింత పెరిగారు. ఆదివారం అద్దంకి డిపో కు సుమారు రూ.16,14,648 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జ్ డీఎం మహబూబీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళాశక్తి పథకంతో మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. విజయవాడ, శ్రీశైలంలకు నడిచే ఎక్స్‌ప్రెస్‌లతో పాటు గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లెవెలుగు బస్సులలో కూడా ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ఆదివారం 115 శాతం ఓఆర్‌తో రూ.16,14,648 ఆదాయం వచ్చింది. సోమవారం కలెక్షన్ రూ.18 లక్షలు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం సమయంలో కూడా ప్రయాణికులు కిక్కిరిసి పోయారు. ఉదయం, సాయంత్రం సమయాలలో రద్దీ మరింత ఎక్కువగా ఉంది.

నూలుమిల్లులో వ్యక్తి అనుమానాస్పద మృతి

ఇంకొల్లు, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఇంకొల్లులోని ఎన్ఎస్ఎల్ నూలు మిల్లులో సోమవారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్లితే కారంచేడు మండలం కేశవరప్పాడు ఎస్సీ కాలనీకి చెందిన నేలపాటి కోటేశ్వరరావు(67) చాలాకాలంగా నూలుమిల్లులో పనిచేస్తున్నాడు. సోమవారం యథావిధిగా ఇంటి వద్ద నుంచి విధులకు హాజరయ్యారు. వీవింగు విభాగం దగ్గరలోని భూగర్భం లోని ఓ గదిలో ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందాడు. నూలు మిల్లు యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సీఐ రమణయ్య, ఎస్సై సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని వారు తెలిపారు.

చీరాల జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

అవీఇవీ

ఇరువురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

హుటాహుటిన వైద్యశాలకు తరలింపు


అపస్మారక స్థితిలో రత్నబాబు

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెం వద్ద 216 జాతీయ రహదారి వెంబడి సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం.... ఒంగోలు నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన నక్క రత్నం, దానియేలుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురు బాబాయి అబ్బాయి వరుస అవుతారు. ప్రమాదంలో ఇరువురు అపస్మారక స్థితికి చేరారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది, స్థానికుల సహకారంతో క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు పక్కన పొలాల్లోకి దూసుకుపోగా, అందులోని భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు.


దానియేలును హస్పిటల్‌కు తరలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్, స్థానికులు

రుణం కోసం నిరీక్షణ

(3వ పేజీ తరువాయి)

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజేయస్వామి కూడా హాజరయ్యారు.

సబ్సిడీపై 115 రకాల యూనిట్లు

బీసీ కార్పొరేషన్‌తోపాటు మరో ఏడు కార్పొరేషన్ల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీపై 115 రకాల యూనిట్లను అందజేసేందుకు దరఖాస్తులను స్వీకరించి మంజూరు ఉత్తర్వులను అందజేసింది. అందులో ఆటోలు, ట్రాక్టర్లు, జనరిక్ మందుల దుకాణాలు, చేతివృత్తుల వారికి అవసరమైన యూనిట్లు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి 45శాతం సబ్సిడీ, మరి కొన్నింటికి 50శాతం సబ్సిడీనీ ప్రకటించారు. అత్యధికంగా రూ.10లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల దుకాణాలు ఉన్నాయి.

సబ్సిడీ విడుదల కాక నిలిచిపోయిన గ్రౌండింగ్

బీసీ కార్పొరేషన్ అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలు ఆయా జిల్లాల్లోని సంబంధిత బ్యాంకులకు వెళ్లాయి. బ్యాంకుల్లో రుణ ఖాతాలు కూడా ప్రారంభమయ్యాయి. యూనిట్లను సరఫరా చేసే సంస్థల నుంచి లబ్ధిదారులు కొటేషన్లను కూడా తెచ్చుకున్నారు. వీటిని బ్యాంకుల వద్ద అందజేసేందుకు తిరుగుతుంటే బ్యాంకు అధికారులు ప్రభుత్వం నుంచి ఇంకా సబ్సిడీ నిధులు విడుదల కాలేదని చెబుతున్నారు. కార్పొరేషన్ నుంచి బ్యాంకులకు సబ్సిడీ నిధులు విడుదలైతే అప్పుడు గ్రౌండింగ్ చేస్తామంటూ లబ్ధిదారులను వెనక్కి పంపుతున్నారు. రుణ మంజూరు ఉత్తర్వులు అందుకున్న లబ్ధిదారులు ఐదు నెలల నుంచి యూనిట్ల గ్రౌండింగ్ కోసం బ్యాంకులు, బీసీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎప్పుడు నిధులు విడుదలవుతాయో కూడా తాము చెప్పలేమంటూ ఆ కార్యాలయం నుంచి సమాధానం ఎదురవుతోంది. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈ క్రాప్ నమోదుకు గడువు పెంపు

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నుంచే మండలాల వారీ భూవిస్తీర్ణం వివరాలు వ్యవసాయ శాఖకు అందాయి. అందులో ఇప్పటివరకు 7,40,416 ఎకరాల (48.98శాతం) విస్తీర్ణం వివరాలను అధికారులు నమోదు చేశారు. తొలుత గడువు ఇచ్చిన సెప్టెంబరు ఆఖరు వరకు చూస్తే 45శాతం మాత్రమే నమోదైనట్లు సమాచారం. కొన్ని మండలాల్లో వేగవంతంగా సాగుతున్నా మరికొన్ని మండలాల్లో తీవ్రజాప్యం జరుగుతోంది.

అత్యధికంగా మద్దిపాడు మండలంలో 80.08శాతం నమోదు

అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో అత్యధికంగా మద్దిపాడు మండలంలో 80.08శాతం ఈ-క్రాప్ నమోదైంది. అది ఎర్రగొండపాలెంలో 76.50శాతం, గిద్దలూరులో 72.21శాతం, ఎన్‌జీపాడులో 69.98శాతం, త్రిపురాంతకంలో 63.73శాతంగా ఉంది. అత్యల్పంగా దర్శి మండలంలో 33.08శాతం విస్తీర్ణంలో నమోదవగా పుల్లలచెరువులో 33.63శాతం, తాళ్లూరులో 34.84శాతం, తర్లుపాడులో 34.87శాతం, సీఎస్‌పురంలో 35.98శాతం చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 25 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆ వివరాలను గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాలలో ఈనెల 26 నుంచి 30 వరకు ప్రచురించి లోటుపాట్లు ఉంటే సవరిస్తారు. అనంతరం 31న తుది జాబితాలను ప్రచురిస్తారు. పెంచిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఈ-పంట నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) సీహెచ్.శ్రీనివాసరావు సూచించారు. అలాగే రైతులు కూడా సిబ్బందికి సహకరించాలని కోరారు.

లోగ్రేడ్ పొగాకు కిలో రూ.69

- లబోదిబోమంటున్న పొగాకు రైతులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు6(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండులో సోమవారం జరిగిన వేలంలో లోగ్రేడ్ పొగాకు కిలో కనిష్ఠ ధర రూ.69కి వ్యాపారులు కొనుగోలు చేశారు. నాణ్యమైన పొగాకును కిలో గరిష్ఠ ధర రూ. 315కు వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతులు వద్ద గల లోగ్రేడ్ పొగాకును వేలంకు 80శాతం పైగా తీసుకురాగా ఇదే అదునుగా భావించిన పొగాకు వ్యాపారులు వేలంలో సిండికేట్ అయి అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో పొగాకు రైతులు ఏమి చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. సోమవారం వేలంకు మొత్తం 1,510బేళ్లు రాగా 1,318 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.130 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

గోతులలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

- అవస్థలు పడి ప్రైవేట్ వాహనాలలో వెళ్లిన ప్రయాణికులు

బల్లికురవ. అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కొణిదెన-మార్టూరు గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో ఆర్టీసీ బస్సు సోమవారం రోడ్డుపై ఉన్న పెద్ద గోతులలో కురుకు పోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రోడ్డు బాగా దెబ్బతినడంతో పాటు వర్షం పడడంతో గోతులలో నీరు ఉండడంతో బస్సు దిగబడిందని ప్రయాణికులు తెలిపారు. అద్దంకి నుంచి చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తుండగా రాజుపాలెం గ్రామ సమీపంలో బస్సు నిలిచి పోవడంతో ప్రయాణికులు మార్గమధ్యలో ఉండి పోవాల్సి వచ్చింది. కొందరు ఆటోలను పిలిపించుకొని తమ గమ్యాలను తరలి వెళ్లారు.


రాజుపాలెం వద్ద గోతులలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

కుండపోత..

ఒంగోలులో గంటకుపైగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు

నగర సమీప ప్రాంతాల్లో పిడుగులు



నీట మునిగిన మదర్‌థెరిస్సా కాలనీ



ఎఫ్‌సీఐ పక్కనే ఉన్న రైల్వే వంతెన చివరన నీరు



రామ్‌నగర్‌లో వర్షపు నీటిని బయటకు పంపుతున్న సిబ్బంది



నీటితో మునిగిన రోడ్డు

ఒంగోలు నగరం ఆదివారం అర్ధరాత్రి కురిసిన వానకు తడిసి ముద్దయింది. సుమారు 12-30 గంటల ప్రాంతంలో మొదలైన వాన కుండపోత వర్షం కురవడంతో నగరం చెరువైంది. ఒకవైపు భారీ వాన, మరోవైపు ఉరుములు, మెరుపులతో వీధులన్నీ జలమయంగా మారాయి. కొత్తకూరగాయల మార్కెట్‌లో తెల్లవారిన తర్వాత కూడా కాలు పెట్టే పరిస్థితి లేకపోగా, శివారు కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లో రోడ్లన్నీ నీట మునిగాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం అందులోనూ అర్ధరాత్రి కావడంతో వీధుల్లో జనసంచారం లేకపోయినప్పటికీ దసరా సెలవులు ముగియడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, మంగమూరు రోడ్ జంక్షన్, రైల్వే స్టేషన్‌లో తాము ఎక్కాల్సిన బస్సులు, రైళ్ల వద్దకు వెళ్లేందుకు అవస్థలు తప్పలేదు. ఏకధాటిగా కురిసిన వానతో నగరం చల్లబడటంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. నగర పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్.

ఏడాదిలో పాలనలో ఎన్నో నిర్ణయాలు

వ్యాపార వేగవంతం, పాలన సరళీకృతం, పెండింగ్ పారిశ్రామిక సమస్యలు పరిష్కారం

వచ్చే ఏడాది కాలంలో తీరప్రాంతంలో మౌలిక సదుపాయాల పూర్తికి కార్యాచరణ

ఆంధ్రజ్యోతితో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



సత్య

ఒంగోలు అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం.. నిరంతర శ్రమ, నిబద్ధత, చొరవతో పనిచేయడం ద్వారా రాణించడం, తద్వారా అందరి మన్ననలు పొందడంలో యువనేత దామచర్ల సత్యనారాయణ(సత్య) దిట్ట. ఆ సుగుణాలతోనే ఆయన టీడీపీ కుటుంబ వారసత్వాన్ని అలంబనగా చేసుకొని కొద్దిరోజుల్లోనే అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్ మనసులు గెలుచుకొని కొండపి నియోజకవర్గ టీడీపీ సారథ్యం నుంచి రాష్ట్ర స్థాయి కీలక నేతగా ఎదిగారు. అంతేగాక రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం తొలి జాబితాలోనే అత్యంత కీలకమైన ఏపీ మారిటైం బోర్డు చైర్మన్‌గా ఎంపికయ్యారు. రాజకీయఅంశాలు అటు ఉంచితే... మారిటైం బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి గత శనివారానికి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆ బోర్డు కార్యకలాపాలు, నిర్వహణ, వాటి ఫలితాలు, వచ్చే ఏడాది కాలం లక్ష్యాలను సత్య ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఎన్నో విజయాలు సాధించాం

ఏడాది కాలంలో మారిటైం బోర్డులో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు సత్య చెప్పారు. పాలనసరళీకరణ, వ్యాపారం వేగవంతం, పెండింగ్ పారిశ్రామిక సమస్యల పరిష్కారం వంటి మూడు ప్రధాన అంశాలతో ఎన్నో విజయాలు సాధించామన్నారు. వ్యాపార వేగవంతం, ఆదాయ పెంపు కార్యక్రమాల్లో భాగంగా ముందస్తు చెల్లింపులు చేసి తాత్కాలిక లీజు ఒప్పందాలు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న 39 సంస్థల లైసెన్సులను రెన్యూవల్ చేయడం ద్వారా ఖజానాకు గణనీయంగా ఆర్థిక వనరులు సమకూర్చడంతో పాటు 11 సంస్థల గడువు మీరిన లీజు పునఃకేటాయింపు చేశామన్నారు. వ్యాపార సులభతరం కోసం నెలవారీ కేటాయిపు నిబంధనను మార్పు చేసి వార్షిక లైసెన్సు విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. బాపట్ల జిల్లా పరిధిలోని మోటుపల్లి ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ఏర్పాటు ప్రతిపాదనలు, మచిలీపట్నం పోర్టుకు విద్యుత్ కనెక్టవిటి, కాకినాడ పోర్టులో క్యాప్టివ్ టెర్మినల్ నిర్మాణం, రెండు చోట్ల ఆక్వా పార్కుల ఏర్పాటు, రామాయపట్నం పోర్టు వద్ద నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సాంకేతిక అనుమతి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు పోర్టుల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక మార్గదర్శకం కోసం పీఎంసీ నియామకం వంటి పలు చర్యలు వివిధ ప్రాజెక్టులు ముందుకు సాగేలా తీసుకున్నట్లు దామచర్ల సత్య వివరించారు. తీర ప్రాంత భద్రత పెంపులో భాగంగా పోర్టు స్పెషల్ పర్పస్ వెహికిల్స్ విభాగానికి రూ.260 కోట్లు, మౌలిక సదుపాయాల విస్తరణ కోసం రూ.3520 కోట్లు మారిటైం బోర్డు ద్వారా కేటాయింపుతో పాటు ఇండియన్ కోస్టగార్డ్(ఐసీజీ) కోసం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

వచ్చే ఏడాదికి నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు పూర్తి

వచ్చే ఏడాది కాలంలో కీలక అంశాలుగా నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు సత్య తెలిపారు. ఇందులో ఈ ఏడాది డిసెంబర్‌కు మూలాపేట పోర్టులో ట్రయిల్‌రన్ ప్రారంభించి వచ్చే ఏడాది జూన్‌కు పనులు పూర్తి, మచిలీపట్నం పోర్టు పనులు వచ్చే ఏడాది నవంబరుకు అలాగే రామాయపట్నం, కాకినాడ గేట్వే పోర్టు పనులు వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల మెరుగు కోసం వచ్చే ఏడాది డిసెంబరు ఆఖరుకు జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ హార్బర్లు తొలిదశపూర్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు సత్య వివరించారు.

'మీకోసం' అధికారుల మోసం...!


కార్యక్రమానికి రాకుండానే తహసీల్దార్, ఆర్‌ఐ సంతకాలు

మండలంలో అధికారులు లేనట్లేనా?

పెద్దారవీడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ పాలన సజావుగా సాగడం లేదు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఆ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, లేకపోతే వారి తరఫున ఆయా శాఖలకు సంబంధించిన మిగిలిన అధికారులు తప్పక హాజరు కావాలి. ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలను తీసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలి. లేకపోతే సదరు కారణాలను అర్జీదారునికి తప్పక తెలియజేయాలి.

తూతూమంత్రంగా మీ కోసం

పెద్దారవీడు మండలంలో మీ కోసం కార్యక్రమం నిర్వహించడమే గగనంగా మారింది. సాధారణంగా మీ కోసం కార్యక్రమం మండల తహసీల్దార్ నేతృత్వంలో జరగాల్సి ఉంది. కానీ పెద్దారవీడులో అలా జరుగుతున్న దాఖలా కనిపించడం లేదు. సాంకేతిక సమస్యల కారణంగా వీడియో కాన్ఫరెన్స్ పని ముట్లు పనిచేయడం లేదని మీకోసం కార్యక్రమాన్ని నెలల తరబడి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలి. ప్రజల నుంచి డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో సబ్‌కలెక్టర్‌కు, కలెక్టర్‌కు వచ్చే అర్జీలపై వారికి సమాధాన చెప్పాల్సి ఉంటుంది. కానీ అధికారులెవ్వరూ మీకోసం కార్యక్రమానికి హాజరుకావడం లేదు.



మీ కోసం కార్యక్రమానికి రాకుండానే సంతకాలు చేసిన తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఆర్‌ఐ గోపి

మీ కోసంలో ఒకే ఒక్కడు..



అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీడీవో జాన్ సుందరం

స్థానిక ఎంపీడీవో కార్యక్రమంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఒకే ఒక్క అధికారి హాజరయ్యాడు. కార్యక్రమాన్ని తన ఆధ్వర్యంలో నిర్వహించాల్సి తహసీల్దార్, ఎంఆర్‌ఐలు కార్యక్రమానికి హాజరుకాకుండానే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి మమ అనిపించారు. ఇతర శాఖల అధికారులెవ్వరూ మీ కోసం కార్యక్రమానికి హాజరుకాలేదు. హాజరైన ఎంపీడీవో ఎస్.జాన్‌సుందరం మద్దలకట్ట పంచాయతీ చాట్లమడ నుంచి వితంతువు దుగ్గెల వెంకటసుబ్బయ్య నుంచి వితంతు పించన్ కోసం వచ్చిన అర్జీని తీసుకున్నారు.

ఇసుక రవాణాపై పోలీసు ఆంక్షలు

ఓవర్ లోడ్ కేసుల నమోదు

'మీకోసం'లో కలెక్టర్‌ను కలిసిన ట్రాక్టర్ యజమానులు

స్టాక్ యార్డుకు నోటీసు ఇచ్చిన మైనింగ్ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్/క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : "ఇసుక రవాణాపై పోలీసుల ఆంక్షలు అధికమయ్యాయి. ఒంగోలు పరిసరాల్లో విక్రయించాలంటే ఇసుక స్టాక్ యార్డులో కాటా వేయాల్సిందే. ఇతర ప్రాంతాలలో కాటా వేసిన లారీల వెంట ప్రైవేటు సైన్యం పడి వారిని అనుసరించి పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. అర్ధరాత్రి అయినా పోలీసులు రంగంలోకి దిగి అదనపులోడు అంటూ కేసులు నమోదు చేస్తున్నారని" సోమవారం ఒంగోలు కర్నూల్ రోడ్డు ప్లైఓవర్ సమీపంలో ఉండే ట్రాక్టర్ల యజమానులు కలెక్టర్ రాజాబాబును కలసి వినతిపత్రం ఇచ్చారు. ఇసుక రవాణాకు ఎలాంటి ఆటంకం కలిగించొద్దని ముఖ్యమంత్రి ఆదేశించినా ఒంగోలులో ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారని పలువురు లారీ యజమానులు, ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు.

స్టాక్ యార్డు కాటా వేయకపోతే కేసు

స్థానిక ఇసుక స్టాక్‌యార్డు నుంచి కాటా స్లిప్ లేకపోతే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని లారీ యజమానులు వాపోతున్నారు. నెల్లూరు నుంచి ఇసుక రవాణా చేస్తున్న లారీలు నేరుగా వినియోగదారుని వద్దకు వెళ్లాలంటే కాటా వేసుకొని వెళతారు. స్టాక్‌యార్డులో కాటా స్లిప్ లేకుంటే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. స్టాక్ యార్డులో కాటా వేసుకుంటే టన్నుకు రూ.150 చొప్పున చెల్లించాలని లారీ యజమానులు చెబుతున్నారు. బయిట మార్కెట్‌లో గతంలో టన్నుకు రూ.500కు విక్రయిస్తుంటే ప్రస్తుతం రూ.800 నుంచి రూ.850వరకు చేరింది. నెల్లూరు నుంచి ఒంగోలు వచ్చే వరకు ఎవరూ లారీలను ఆపడంలేదని ఒంగోలులో పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం.

ఇసుక స్టాక్ యార్డు యజమాన్యానికి నోటీసు ఇచ్చిన మైనింగ్ అధికారులు

ప్రైవేటు సైన్యం లారీల వెంట పడి టన్నుకు రూ.150 వసూలు చేస్తున్నారని ప్రచురితమైన కథనాలపై స్పందించిన మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ ఒంగోలు ఇసుక యార్డు యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ వసూళ్లు ఆగలేదని పలువురు లారీ డ్రైవర్లు చెబుతున్నారు. అదే క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఓ లారీని నిలిపివేసిన పోలీసులు ఓవర్ లోడ్ ఉన్నట్లు కేసు నమోదు చేశారు. ఇలానిత్యం ఇసుక లారీలపై ఓవర్‌లోడ్ కేసులు నమోదు చేస్తున్నారు.

ఇసుక ఉచితం అని చెప్పిన ప్రభుత్వం, కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

ప్రభుత్వం ట్రాక్టర్లతో ఇసుక ఉచితంగా తరలించవచ్చు అని చెప్పింది. ఒంగోలు తాలుకా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని సోమవారం కలెక్టర్ రాజాబాబుకు వారాహి ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఇసుక ట్రాక్టర్‌ను ఎక్కడ ఆపడం లేదని తాలుకా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని నాయకులు సురేష్‌బాబు, రాజేష్, వెంకటేశ్వర్లు, ఉప్పు రవితేజ, శ్రీనివాసులుతో పాటు పలువురు ట్రాక్టర్స్ ఓనర్లు ఉన్నారు.

మామూలు మనిషి నుంచి మహర్షిగా ఎదిగి...

బోయవానిగా జన్మించి రామాయణాన్ని రచించిన మహనీయుడు

నేడు వాల్మీకి మహర్షి జయంతి

అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వ నిర్ణయం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహాపురుషులవుతారు అని ఒక సినిమా కవి తన పాటలో చెబుతూ బోయవానిగా జన్మించి, పక్షులను వేటాడే వ్యక్తి తన జీవితంలో ఎదురైన ఒక సంఘటనతో చలించి కవిగా అవతరించి మహోన్నతమైన శ్రీమద్రామయణాన్ని రచించాడని చెబుతాడు. అలా సాధారణ మనిషి నుంచి మహర్షిగా అవతరించిన మహనీయుడు వాల్మీకి. ఆయన రచించిన శ్రీమద్రామయణం మానవులు ధర్మమార్గంలో ఏవిధంగా జీవించాలి అనే విషయాన్ని విశదీకరిస్తుంటే, ఆయన జీవితం అనుకున్న లక్ష్యాలను ఎలా సాధించాలి అనే స్ఫూర్తిని ఇస్తుంది. వాల్మీకి జననం గురించి పలురకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆయన ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడని స్కంద పురాణం చెబుతుంటే, వాల్మీకి అసలు పేరు రత్నాకరుడని, ఆయన బోయవాడని కొన్ని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. అటువంటి వాల్మీకి జయంతిని ఏటా ఆశ్వీయుజ మాసం శుద్ధపౌర్ణమి రోజు జరుపుకుంటాం. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాల్మీకి జయంతిని అధికారిక కార్యక్రమంగా ప్రకటించింది. దీని ప్రకారం గతేడాది అక్టోబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇక మంగళవారం ఆశ్వీయుజ శుద్ధపౌర్ణమి కావటంతో ఆ రోజునువాల్మీకి జయంతిగాజరుపుకోనున్నారు.



వాల్మీకి మహర్షి

వాల్మీకిగా...

మానసిక పరివర్తన చెంది తపస్సు చేస్తుండగా కొంతకాలానికి అతని చుట్టూ చీమలు పుట్టలు పెట్టేశాయి. పుట్టను సంస్కృతంలో వల్మీకం అని అంటారు. పుట్ట మధ్యలో తపస్సు చేసిన రత్నాకరుడు వాల్మీకిగా ప్రసిద్ధిగాంచాడు. ఇక రామాయణం సృష్టికి ప్రేరణ అయిన తన జీవితంలోని సంఘటనను వాల్మీకి రామాయణంలో మొదటి శ్లోకంగా చెబుతాడు. 24 వేల శ్లోకాలు, ఏడు కాండలతో రామాయణాన్ని వాల్మీకి రచించారు.

జిల్లాలోనూ వాల్మీకి జయంతి

మన జిల్లాలో సైతం వాల్మీకి జయంతిని పలు కుల సంఘాల వారు, ఒంగోలులో సంస్కారభారతి వంటి ఆధ్యాత్మిక సంఘాలు కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఇక అనేక రాష్ట్రాలలో ఉన్నట్లే వాల్మీకి జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

బాణసంచా విక్రయానికి గడువు పొడిగింపు

9వ తేదీలోపు దరఖాస్తులకు అవకాశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగకు జిల్లాలో బాణసంచా విక్రయించేందుకు ఆసక్తి ఉన్న వ్యాపారులు తాత్కాలిక క్రాకర్స్ లైసెన్సుకు ఈనెల 9వ తేదీవరకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు పొడిగించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువు ఈనెల 5వ తేదీతో ముగియగా అభ్యర్థన మేరకు మరో మూడు రోజులు పొడిగించినట్లు వివరించారు. మీసేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సంబంధిత అన్ని పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జిల్లాలో 13.4 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం తూర్పు ప్రాంతంలో అధికంగా ఉంది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 13.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. కొత్తపట్నం 72.4, చీమకుర్తి 72.0, ఒంగోలు రూరల్ 62.6, ఒంగోలు అర్బన్ 62.6, మద్దిపాడు 48.8, నాగులుప్పలపాడు 40.6, సంతనూతలపాడు 39.8, పుల్లలచెరువు 33.6, టంగుటూరు 26.0, మర్రిపూడి 21.8, పొదిలి 16.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో ఐదారు మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు దోర్నాల విద్యార్థి



ఎంపికయిన విద్యార్థితో ఉపాధ్యాయ సిబ్బంది

పెద్ద దోర్నాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి భూమని నాగరాజు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయిని శ్యాంప్రసన్నతాంజలి సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో గత నెల 15వ తేదీన ఒంగోలు ఏబీఎం హైస్కూల్‌లో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో నాగరాజు ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 10,11,12వ తేదీల్లో అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరులో నిర్వహిస్తున్న విలువిద్య పోటీల్లో నాగరాజు పాల్గొననున్నట్లు చెప్పారు. శిక్షకుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు పీ రామనాయక్, హెచ్ రామానాయక్‌ను అభినందించారు.



నీటితో నిండిన త్రిపురాంతకస్వామి ఆలయ ఆవరణ

నీట మునిగిన త్రిపురాంతకస్వామి ఆలయం



నీటమునిగిన గర్భగుడి

సంతనూతలపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతనూతలపాడు పెద్ద చెరువు అలుగు పారుతూ స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయం ముందున్న కల్వర్టరు వద్ద తూముకు చెత్తాచెదారం అడ్డుపడింది. దీంతో ఆ నీరు ఆలయంలోకి చేరాయి. ఆలయం గర్భగుడి, ఆలయ సమీపంలోని మాగాణి భూమి కూడా నీటమునిగింది. ఈ సమాచారాన్ని అర్చకులు బుచ్చిబాబు శర్మ, ఈవో నారాయణరెడ్డికి, కమిటీ చైర్మన్‌కు అందజేశారు. వెంటనే వారు ఎక్స్‌కవేటర్ ద్వారా తూముల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో ఆలయంలోని నీళ్లన్నీ బయటకు వెళ్లిపోయాయి.


చెస్ క్రీడాకారినికి
ఆర్థిక సహాయం అందించిన లైన్స్ క్లబ్ సభ్యులు

క్రీడాకారినికి ఆర్థిక సహాయం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఒంగోలులోని పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆముక్త మాల్యదకు రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాల్యద ఈనెల 14నుంచి 26వతేదీ వరకు హంగేరిలో జరగనున్న చందరంగం పోటీలో పాల్గొననున్నారు. దీంతో ఈ ఆర్థిక సహాయాన్ని క్లబ్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పార్థసారధి, కార్యదర్శి స్వామి, కోశాధికారి నందకుమార్, కూరపాటి రమేష్, తమ్మన ఆంజనేయులు, పల్లపు సుబ్బయ్య, మిరియాల కృష్ణమూర్తి, రాచమల్లు గోపి, కిషోర్, బియ్యపు విజయ్ కుమార్, ఉమ్మపూడి పాండురంగారావు, కిషోర్ తదితరులు ఉన్నారు.


అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

హెచ్ఐవీపై అవగాహన

ఒంగోలు విద్య, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ/ఎయిడ్స్, సెక్స్ ద్వారా సంక్రమించే వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతినిధి కమల మాట్లాడుతూ యువతకు ఆరోగ్యంపై అవగాహన అవసరమన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి. హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సుధీర్ చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రామపిచ్చయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.


అంకమ్మతల్లి ఆలయం ముందు
బోరు వేయిస్తున్న టీడీపీ నాయకుడు కుంచాలరాజు

అంకమ్మ తల్లి ఆలయంలో బోరు నిర్మాణం

సంతనూతలపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.తక్కెళ్లపాడు గ్రామంలోని అంకమ్మతల్లి ఆలయంలో సోమవారం టీడీపీ జిల్లా నాయకుడు కుంచాల రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా రూ.50వేలతో బోరు నిర్మాణం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ స్ఫూర్తితో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేష్, బి.చలపతిరావు, జీ.చిరంజీవి, ఎస్.శ్రీను, ఎం.కృష్ణ, ఆర్.శ్రీను, లక్ష్మీనారాయణ, వందనం, కోటయ్య, లాజర్, అంకయ్యలు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పేస్ విద్యార్థికి బంగారు పతకం

ఒంగోలు విద్య, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థి ఎన్. సుకుమార్ ఎన్‌సీసీలో బంగారు పతకం సాధించారు. గుంటూరు లయోలా కళాశాలలో 34(ఎ) ఎన్‌సీసీ బెటాలియన్ నిర్వహించిన ఆర్‌డీసీ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం పొందారు. ఈసందర్భంగా కళాశాలలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో సుకుమార్‌ను కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, సీవీ సుబ్బారావు, ఆర్. వీరాంజనేయులు, బి. రూప తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్‌లో జీఎస్టీపై ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న జేసీ

కమాండ్ కంట్రోల్ రూం పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై రాష్ట్ర పన్నులశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమును జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పరిశీలించారు. జిల్లాలో పన్నుల కార్యక్రమాల షెడ్యూలింగ్, డాక్యుమెంటేషన్‌ను పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశాఖ అధికారులు ఉన్నారు.

అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలి

- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి అర్జీ రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలను కలెక్టర్ జారీచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాకుండా వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమస్య పరిష్కారమైన తర్వాత పరిష్కార విధానం, దరఖాస్తుదారులు సంతృప్తి చెందారా, లేదా అన్న విషయాన్ని అధికారులు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వ సేవలపై ప్రజలకు సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి ఖచ్చితంగా సంబంధిత జిల్లా శాఖల అధికారులు రావాలని, ఏదైనా కారణాల వల్ల రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకొని సెకండ్ లెవల్ అధికారిని పంపించాలని సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు, డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, విజయజ్యోతితో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.


మీకోసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు

మద్దిపాడు : మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి తెలిపారు. గుండ్లాపల్లి, దొడ్డవరం గ్రామాల నుంచి భూమి సర్వే కోసం అర్జీలు వచ్చాయని, వెంటనే వాటిని పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ గ్రీవెన్స్

66 మంది ఫిర్యాదులు

ఒంగోలు క్రైం : వివిధ సమస్యలతో ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చే వారి సమస్యలు గురించి నేరుగా వీడియో సమావేశంలో అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలలు నుంచి 66 మంది తమ వినతులను నేరుగా ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదిదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో వీడియో సమావేశం ద్వారా ఫిర్యాదిదారుల సమస్యలను వివరించి వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు దుర్గాప్రసాద్, హజరత్తయ్య, బీమానాయక్, మల్లికార్జునరావు, ఎస్సై జనార్దన్‌రావులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు ఘన సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురు విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఒంగోలులోని మేదర భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంస్థ చైర్మన్ మారెళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ ఒక మంచి సమాజం ఏర్పడాలంటే మంచి పౌరులు తయారు కావాలని, అలా మంచి పౌరులను తయారుచేసే గురుతర బాధ్యతను పోషించేది ఉపాధ్యాయులని, వారిని సత్కరించుకోవటం అభినందనీయమని అన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మండవ కమల మాట్లాడుతూ నగరంలోని మహాప్రస్థానాన్ని శుభ్రపరచాలని మానవతా సేవాసంస్థ సంకల్పించటం అభినందనీయమని అన్నారు. సంస్థ నాయకురాలు వడ్డెంపూడి సుజాత సన్మానగ్రహీతలైన ఉపాధ్యాయుల సేవల గురించి వివరించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు యలమందారెడ్డి సంస్థ ఆశయాలను వివరించారు. ఈ సందర్భంగా 10 మంది విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శరభలింగాచారి, భోజిరెడ్డి, చౌదరి, కోసూరి శ్రీదేవి, పచ్చవ మాధవి, బంక ప్రసన్న, చిలుకూరి ఆదిలక్ష్మి, బుజ్జి, దన్నారపు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమను సంక్షోభం నుంచి కాపాడాలి

కలెక్టర్, మైన్స్ డీడీని కోరిన ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పరిశ్రమను కాపాడాలని గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. మైన్స్ డీడీ రాజశేఖర్‌ని సోమవారం కలిసిన నాయకులు సమస్యలు పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 1నుంచి నిరవధిక సమ్మెలో ఉన్న గ్రానైట్ యజమానులు డీడీ రాశేఖర్‌ను కలిసి ఇచ్చిన వినతిపత్రంలో వివరాలు ఇలా ఉన్నాయి.


మైన్స్ డీడీ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఓనర్ల అసోసియేషన్ నాయకులు

- శ్లాబ్ విధానంలో భాగంగా కట్టర్‌కు రూ.35వేలు, అదనంగా జీఎస్టీ చెల్లిస్తున్న నేపథ్యంలో రాళ్ల కొలతలతో సంబంధం లేకుండా పర్మిట్లు మంజూరు చేయాలని కోరారు.
- అక్టోబర్ 1నుంచి శ్లాబ్‌సిస్టంలో చెల్లించే రాయల్టీని కట్టర్‌కు రూ.35 వేలకు పెంచగా మరో రెండు సంవత్సరాలు పెంపును అమలు చేయకుండా పాతపద్ధతి ప్రకారమే రూ.27వేలు చెల్లించేవిధంగా సవరణ ఉత్తర్వులను ఇవ్వాలని కోరారు.
- మైనింగ్ సిస్టంలో ఒక క్యూబిక్‌మీటర్‌కు 500 చదరపు అడుగులు రికవరీగా నిర్ధారణ చేయాలని కోరారు.
- సీనరేజి వసూలు హక్కులు కైవసం చేసుకున్న ఏఎంఆర్ సంస్థ కట్టర్‌కు ప్రభుత్వం నిర్ధేశించిన రేటు కన్నా అదనంగా రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, ఇలా చేస్తే ఫ్యాక్టరీలు నడిపే పరిస్థితి ఉండదన్నారు.
- రాయల్టీ చెల్లించినందుకు తమకు కేటాయించిన 22 మీటర్లను 90 రోజుల పాటు వినియోగించుకొనే అవకాశం ఇవ్వాలి.
- ముడిరాళ్లను కొనుగోలు చేసే సమయంలో కొలతల వ్యత్యాసాన్ని 20 శాతం వరకూ అనుమతించాలి.
- సీనరేజి హక్కులు పొందిన సంస్థతో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి
- సమ్మె పరిష్కారానికి చొరవ తీసుకొని పరిశ్రమను ఆదుకొనే చర్యలు చేపట్టాలి. ఈ వినతి పత్రం అందజేసినవారిలో అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య. యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

చీమకుర్తి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): గంజాయి,పేలుడు పదార్థాలు ఆచూకీ కోసం సోమవారం చీమకుర్తి పట్టణంలో డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వద్ద పార్సిల్ కార్యాలయాలు,బస్‌లు,గరికమెట్ట ప్రాంతం, ప్రభుత్వ ఆసుపత్రి చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన డాగ్‌తో తనిఖీలు జరిపారు.సీఐ సుబ్బారావు,డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.


చీమకుర్తిలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

డాక్టర్ శ్రావణ్ కుమార్‌కు ఘన సత్కారం

మద్దిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛ ఆంధ్ర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషించిన మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్‌ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఒంగోలు రిమ్స్ ప్రాంగణంలో జరిగిన సభలో ఆయనకు ప్రశంసాపత్రాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పించి సత్కారం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా అంగన్వాడీ సూపర్వైజర్‌ను కూడా ఘనంగా సత్కరించారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక రామ్‌నగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం నాలుగు గంటలకు గుంటూరు రోడ్డులోని ఏ1 కన్వెన్షన్ హాలులో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

జూదరుల బైండోవర్

సంతనూతలపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనంపాడు పొలాల్లో ఆదివారం పేకాడుతూ దొరికిన ఏడుగురిని సోమవారం తహసీల్దార్ ఎస్ఎల్.నారాయణరెడ్డి వద్ద పోలీసులు రూ.లక్షరూపాయల పూచికత్తుతో ఎస్సై వి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు. జూదరులు దీనిని ఉల్లంఘిస్తే కోర్టుకు పూచికత్తు నగదును స్వాధీనం చేయనున్నట్లు తెలిపారు.

మోటార్‌బైక్ అదుపుతప్పి మహిళకు గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద సోమవారం మోటార్‌బైక్ అదుపుతప్పిన ఘటనలో మహిళకు గాయాలయ్యాయి. పి.నాగమణి తన ద్విచక్ర వాహనంపై నాగులపల్లి నుంచి అద్దంకి వెళ్తుండగా లారీ స్పీడ్‌గా రావటంతో ఆమె కంగారుపడింది. దీంతో వాహనం అదుపుతప్పింది. గాయాలైన నాగమణిని అద్దంకి ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

అర్ధరాత్రి వర్షంతో అవస్థలు


రైల్వే ఫ్లైవోవర్ తూర్పువైపున నిలిచిన వర్షపునీరు

● రైల్వే ఫ్లైవోవర్ తూర్పువైపున నిలిచిన నీరు

● వాహనదారులకు అసౌకర్యం

ఒంగోలు(రూరల్),అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్‌నుంచి కొప్పోలు వెళ్లే రోడ్డులోని రైల్వే ఫ్లైవోవర్ వంతెనకు తూర్పువైపు దిగువన ఆదివారం అర్ధరాత్రి తరువాత కురిసిన వర్షంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌర్యం ఏర్పడింది. వంతెనకు దిగువన అడుగుకు పైగా నీరు చేరింది. దీంతో సోమవారం తెల్లవారు జామున వాహనదారులు ప్రయాణించలేక పోయారు. నీటి ప్రవాహంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు నీటి ప్రవాహం తగ్గిన తరువాత రైల్వే ఫ్లైఓవర్ వంతెనపైన ప్రయాణం సాగించారు. ముఖ్యంగా ఫ్లైవోవర్ వంతెనకు తూర్పున నీటి ప్రవాహ కాలువ ఉంది. ఆ కాలువ పొంగి పొర్లి ప్రవహించింది. ఒంగోలు నగరంలోని సంతపేట ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వర్షపునీరు, డ్రైనేజ్ నీరు ఇటే వస్తోంది. మునిసిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి రైల్వే ఫ్లైవోవర్ వంతెనకు తూర్పు వైపున నీటి ప్రవాహ సమస్య రాకుండా నివారణా చర్యలు చేపట్టాలని వాహనదారుల, కొప్పోలు రోడ్డులోని కాలనీల వాసులు కోరుతున్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ఖండన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసిరేందుకు ప్రయత్నించిన మతోన్మాద న్యాయవాది కిషోర్‌పై కేసు నమోదు చేసిన కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాజిరాజు, బి.రఘురాంలు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.


ప్రజలు వెళ్లకుండా రహదారిని
ఆక్రమించి బోర్డుపెట్టిన హోటల్ కం లాడ్జి యాజమాన్యం

కార్పొరేషన్ రోడ్డు ఆక్రమణ

● నెల్లూరు బస్టాండ్‌లో ఓ లాడ్జి యజమాన్యం నిర్వాకం

ఇప్పటి వరకు ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములు, దేవుడు భూములు ఆక్రమణలకే పేరు పొందిన నగరం తాజాగా ప్రజల సౌకర్యార్థం, రాకపోకల కోసం కార్పొరేషన్ అధికారులు నిర్మించిన రోడ్డునూ ఆక్రమించేశారు. స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని ఓ రెస్టారెంట్‌ను ఆనుకుని ఉన్న రోడ్ మార్గం నెల్లూరు బస్టాండ్ మెయిన్ రోడ్ నుంచి ధారావారితోటకు అనుసంధానంగా సర్వీస్ రోడ్ నిర్మించారు. అయితే ఆ రోడ్‌లో ఓ లాడ్జీని ఏర్పాటు చేసిన యాజమాన్యం ప్రజలు రాకుండా ఆంక్షలు విధించారు. దీంతో రోడ్డు మొత్తాన్ని ఆక్రమించేసి, అటువైపు కనీసం కాలినడకకు కూడా అవకాశం ఇవ్వకుండా తమ స్వాధీనంలోకి తీసుకుని బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి, ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్‌లో రాకపోకలకు అనుమతించాలని పలువురు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

11న పీవీఆర్ శతాబ్ది వేడుకల ర్యాలీ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11వ తేదీన నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శతాబ్ది ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధి అరిగ వీరప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల దగ్గర నుంచి ప్రారంభమ్యే ఈ ర్యాలీ గాంధీ పార్క్, సాయిబాబా మందిరం, రాజాపానగల్ రోడ్డు, జయరాం థియేటర్ జంక్షన్, గాంధీరోడ్డు, దక్షిణం బజార్, ఏనుగుచెట్టు, మిరియాలపాలెం, ట్రంక్‌రోడ్డు, మస్తాన్ దర్గా, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, బండ్లమిట్ట, గంటాపాలెం మీదుగా పీవీఆర్ మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాల వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొనాలని, ద్విచక్రవాహనాలు ఉన్నవారు బైక్ ర్యాలీగా రావాలని ఆయన కోరారు.

అంతరిక్ష వారోత్సవాల్లో పాల్గొనాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : షార్, ఇస్రో, క్విస్ ఇంజనీరింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నుంచి క్విస్ కళాశాలలో ప్రారంభం కానున్న అంతరిక్ష వారోత్సవాల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి స్పేస్‌వాక్ ప్రారంభమవుతుందన్నారు. 7,8,9 తేదీల్లో నిర్వహించే అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, పోస్టల్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై సంపూర్ణ అవగాహనను పెంపొందించుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి పేర్కొన్నారు. జిల్లా రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సులో సమాచార హక్కు చట్టంపై వచ్చే దరఖాస్తులకు ఎలా సమాచారం ఇవ్వాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో ఆర్డినేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జిల్లా టీమ్ సభ్యులు ఉన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ అండర్ 14/17 బాలబాలికల టోర్నమెంట్ ఎంపికలు మంగళవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు స్థానిక జాతీయ వ్యాయామ కళాశాలలో జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి చెక్కా వెంకటేశ్వర్లు, ఏ శిరీషకుమారిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్‌డీవో రాజేశ్వరి పాల్గొంటారన్నారు. క్రీడాకారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

మద్దిపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):పొగాకు నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ డి.సంధ్య తెలిపారు. సోమవారం కొలచనకోట, వెల్లంపల్లి గ్రామాల్లో నర్సరీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పొగాకు నారు నెట్ చుట్టూ మూడు అడుగుల వరకు ఎలాంటి కలుపు మొక్కలు ఉండకూడదని, జిగురు రంగు అట్టలను ఉంచాలని అన్నారు. ప్రతి బెడ్డుకు కంపెనీ వెరైటీ, నాటిన తేదీ వివరాలు పెట్టాలని, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నర్సరీలపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

12వ పీఆర్సీని వెంటనే నియమించాలి

ఒంగోలు(రూరల్),అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బడే అంకిరెడ్డి ,కంచర్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. ఒంగోలు నగరం పులివెంకటరెడ్డి కాలనీలోని పెన్షనర్ల సంఘ భవనంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న 4 డీఏ, డీఆర్‌లలో రెండింటిని వెంటనే ప్రకటించాలని, 11వ పీఆర్సీ అరియర్స్‌ను విడతల వారీగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాచర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ఎస్ పనులు ముమ్మరంగా జరుగుతున్నందున విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ డీఈఈ బీవై శేష గిరిరావు అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం ఉదయం 9 నుంచి 2గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని అన్నారు.

సచివాలయం తనిఖీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు-1, కొమ్మునూరు సచివాలయాలను ఎంపీడీవో కె.సీతారామరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలు చెప్పుకునేందుకు, పరిష్కారానికి కార్యాలయానికి వచ్చే ప్రజలను గౌరవంతో చూడాలని సిబ్బందికి సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

పొదిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాబ్ కార్డు ఉన్న ఉపాధి హామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీని చేయించుకోవాలని ఏపీవో మహాలక్ష్మి సోమవారం తెలిపారు.

దీనస్థితిలో ముసి ఆయకట్టు



170 మీటర్ల పొడవున నిర్మించిన కట్ట



నిరుపయోగంగా చిల్లచెట్ల మధ్య ఉన్న ఆయకట్టు



ఇసుక మేటలతో నిండిన ముసి

- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని పథకం
- 1200 ఎకరాలకు సాగునీటి సరఫరా లక్ష్యం
- ఆరు గ్రామాల ప్రజలకు ప్రయోజనం

పొదిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల అమాయకత్వం.. అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరితో ఆరు గ్రామాల ప్రజలకు, 1200 ఎకరాలకు శాపంగా మారింది. పుష్కలంగా నీటిని అందాల్సిన సాగునీటి పథకం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చాల్సిన మూసి ఆయకట్టు ప్రస్తుతం ఇసుక మేటలతో పూడిపోయి ఉంది. దీంతో ఈ పథకం ఆయకట్టు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని తలమళ్ల గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న ముసి సమీపంలో సుమారు 30 ఏళ్లకు పైగా రూ.1.2కోట్ల నాబార్డు నిధులతో ఆయకట్టను నిర్మించారు. 13 కిలోమీటర్ల దూరం ప్రధానకాలువను ఏర్పాటు చేశారు. అప్పట్లో పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో పథక లక్ష్యం నీరుగారిపోయింది. మండలంలోని తలమళ్ల, గోగినేనిపాలెం, ఉప్పలపాడు, ఏలూరు, సల్లూరు, నల్లపురెడ్డిపాలెం, మర్రిపూడి మండలాల్లోని గ్రామాలకు చెందిన 1200 ఎకరాలకు సాగునీరు అందించాలన్నదే పథక ఉద్దేశం. ఆయకట్టు కాలక్రమేణా ఇసుక మేటలు వేయడంతో సాగునీటి సరఫరాకు వీలు లేకుండా పోయింది. మరమ్మతులకు కూడా నోచుకోక మూలనపడింది. అక్కడి మోటార్లు కూడా తుప్పుపట్టిపోయాయి. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా ఆ పథకాన్ని వినియోగంలోకి తేవాలన్న ఆలోచనే చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం నివేదికలు తయారు చేయాలన్న ఆదేశాలు తప్ప పనులు జరిగిన పాపాన పోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే నాయకులు, అధికారులు ఆయకట్టును పరిశీలించి పథకాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



కలెక్టర్ నుంచి అవార్డును అందుకుంటున్న పొదిలి తహసీల్దార్

అధికారులకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

పొదిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర జిల్లా స్థాయి అవార్డులకు పలువురు అధికారులు ఎంపికయ్యారు. మండలం నుంచి తహసీల్దార్ కృష్ణారెడ్డి, డీఆర్డీఏ వెలుగు గోపాలకృష్ణ, మున్సిపల్ కార్మికుడు గాలిముట్టి నాగేశ్వరరావు సోమవారం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ద్వారా అవార్డులను అందుకున్నారు.

మార్కాపురం రూరల్ : కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల, డీఆర్డీఏ వెలుగు పీడీ నారాయణ ద్వారా మార్కాపురం ఏపీఎం దుగ్గుం పిచ్చయ్య స్వచ్ఛాంధ్ర అవార్డును అందుకున్నారు. కొత్తపట్నం, ఒంగోలు, మార్కాపురం, పొదిలి, బీపేట మండలాల ఏపీఎంలకు అవార్డులు దక్కాయి.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

గిద్దలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖాగ్రంథాలయం ఆవరణలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా బాలబాలికలకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో భార్గవి, శ్రావణి, స్వరూప్, సీనియర్స్ విభాగంలో హర్షిత్‌రెడ్డి, ప్రచేతన్, భరత్‌లు తొలి 3 స్థానాలు సాధించగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి కిశోర్ బహుమతులు అందచేశారు.

12న చర్చా వేదిక

గిద్దలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు పూర్తయ్యేనా ? తాగు, సాగు నీటి కష్టాలు తీరేనా అనే అంశంపై ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు విశ్వభారతి ఉన్నత పాఠశాల ఆవరణలో చర్చా వేదిక నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజలు ప్రకృతి విపత్తులతో ఇబ్బందులు పడుతున్నారని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే తప్ప సాగు, తాగునీటి కష్టాలు తీరవని అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.లక్ష్మణరావు, విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి స్వరూపారెడ్డి, వివిధ సంఘాల ముఖ్యనాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యావంతులు, రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియచేయాలని కోరారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవం

గిద్దలూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శత వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రమశిక్షణ, శౌర్యం, ఐక్యత ఆర్ఎస్ఎస్ లక్ష్యాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, నారాయణ, బాదుల్లా, నరసింహులు, పుల్లయ్య, విశ్వభారతి పాఠశాల కరస్పాండెంట్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అనుమతులు తీసుకోవాలి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏ కార్యక్రమానికైనా డిజె సౌండ్ సిస్టమ్ ఉపయోగిస్తే ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలని అర్బన్ సీఐ సురేష్ పేర్కొన్నారు. అనుమతులు తీసుకోకుండా డీజే సౌండ్ వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌లో డీజే సౌండ్ సిస్టమ్ అద్దెకు ఇచ్చే యజమానులతో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించి సౌండ్ వినియోగిస్తే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. సీపీఐ కార్యాలయంలో మార్కాపురం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు ప్రజా సంఘాల సమావేశం సోమవారం డీకేఎం రఫి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీని ప్రభుత్వం నిర్వహించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. అందె నాసరయ్య, కాశీం, సోమయ్య, బాలనాగయ్య, రజాక్ సుదర్శన్, కాశయ్య, పెద్దన్న పాల్గొన్నారు.

సబ్ యూనిట్ ఆఫీసర్‌గా నాగేంద్రరెడ్డి



నాగేంద్రరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

మార్కాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కీటకవాహక నియంత్రణ కార్యక్రమం మార్కాపురం సబ్ యూనిట్ అధికారిగా ఆర్.నాగేంద్రరెడ్డి సోమవారం విధుల్లో చేశారు. ఈయన ఇప్పటి వరకు దోర్నాలలో పని చేశారు. ప్రస్తుతం పూర్తి బాధ్యతలతో మార్కాపురం సబ్ యూనిట్ అధికారిగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ఆ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి

పొదిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం సోమవారం ఉపాధ్యక్షుడు పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

రోడ్డు కోసం తహసీల్దార్‌కు ఫిర్యాదు

త్రిపురాంతకం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు కట్టుకున్నాం నివాసముంటున్నాం కానీ సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నామని ఎన్నెస్పీ కాలనీలోని కొందరు ప్రజలు తహసీల్దార్ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డుకోసం అడుగుతున్నా పంచాయతీ పాలకులు గానీ ఇతర ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని చెప్పారు. దీంతో ఎంపీడీవో రాజ్‌కుమార్‌కు సమస్యను తెలియజేయగా ఇద్దరు కలిసి రోడ్డును పరిశీలించారు. చెట్లు పెరిగి వెళ్లేందుకు ఉన్న ఇబ్బందిని తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని రోడ్డు నిర్మాణం గురించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. తమ సమస్యను పరిష్కరించి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.



రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రజలు

ఘనంగా పోతురాజు, పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొమరోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లినగరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోతురాజు, అంకాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను శనివారం నుంచి సోమవారం వరకు ఘనంగా నిర్వహించారు. చలువాది వెంకటేశ్వరరావు, ప్రియదర్శిని దంపతుల ఆర్థిక సాయంతో ఆలయాన్ని నిర్మించారు. అన్నదానం శివబాలకుమార్ శర్మ వేద పండితులతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొన్నారు. పట్టాభిరామస్వామి దేవస్థానం తరుపున గ్రామానికి చెందిన తిరుమల స్వామికొండయ్య అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ధర్మకర్త చలువాది వెంకటేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మునగనూరి రామకృష్ణయ్య, సుబ్బయ్య, ప్రజలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

మార్కాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని రైతు సంఘం నాయకులు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు డి.సోమయ్య మాట్లాడుతూ మార్కాపురం డివిజన్‌లో వేలాది ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గ్రామాల్లో దళారులు చౌకగా పత్తిని కొనుగోలు చేస్తూ రైతులను కొల్లగొడుతున్నారన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయాల్సివున్నా ఆ దిశగా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏవో రవీంద్రారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.రాజశేఖర్‌రెడ్డి, ఏరువ పాపిరెడ్డి, డి.తిరుపతిరెడ్డి, బి.లక్ష్మీనాయక్, కాశిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంతోషం

14వ బ్లాకులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీలో ఎమ్మెల్యే కందుల



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 14వ బ్లాకులో సోమవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ, ఇంటింటి ప్రచారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలపై చాలా భారం తగ్గిందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు ప్రయోజనం పొందుతున్నారన్నారు. యువతకు ఇప్పటికే 4.75 లక్షల ఉద్యోగాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. మార్కాపురం ప్రత్యేక జిల్లాతోపాటు మెడికల్ కాలేజీ త్వరలోనే పూర్తవుతుందన్నారు. త్వరలో మినీ మిర్చియార్డు ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నారాయణరావు, ఏఎంసీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, పార్టీ వైద్యవిభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ షేక్ మౌలాలి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోఆప్షన్ సభ్యుడు అమీరుల్లాఖాన్‌కు నివాళి

మార్కాపురం మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పఠాన్ అమీరుల్లాఖాన్ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం ఉదయం స్థానిక 8వ వార్డులోని అమిరుల్లాఖాన్ నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ఎమ్మెల్యేకు భాషా పండితుల కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వం డీఈవో పూల్ బాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించిన నేపథ్యంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యే కందులను ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్రకుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఈవో పూల్ బాషా పండితుల ఉద్యోగోన్నతుల సమస్యను మంత్రి నారా లోకేష్ పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు జీఎల్ రమేష్‌బాబు, డివిజన్ బాధ్యులు విశ్వం, అంజిరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులకు మేలు

పొదిలి : జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతోమేలు కలుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి విశ్వనాథపురంలో వ్యవసాయ, మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల ఆధ్వర్యంలో అధికారులు కలిసి జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలుమాల్స్, ఎరువులు దుకాణాలు, షాపులను సందర్శించి తగ్గిన జీఎస్టీ ధరలను అమలు చేస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. ఎరువుల దుకాణదారులు ధరలు తగ్గించలేదని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన హెచ్చరిక జారీ చేశారు.

పెద్ద దోర్నాల : సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై టీఎన్‌టీయూసీ ఒం గోలు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని హసనాబాద్ గ్రా మంలో ఇంటింటికీ తిరిగి ప్రజా ప్రభు త్వం అమలు చేసిన సూపర్‌సిక్స్ పథకాలు, జీఎస్టీ తగ్గింపువల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాచర్ల : జీఎస్టీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎస్.వెంకట రామిరెడ్డి అన్నారు. ఎంఈవో వీ గిరిధర శర్మ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో సోమవారం జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నోట్ బుక్స్, మ్యాప్స్, స్టేషనరీలపై జీఎస్టీ తగ్గిందన్నారు. అనంతరం ఆయన ఎంఈవోతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బీఎల్ రామానాయక్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



అమీరుల్లాఖాన్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందుల

ప్రజా ప్రభుత్వ పాలనలోనే ఉద్యోగాలు భర్తీ

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ జరిగిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరాములు అధ్యక్షతన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పట్టణంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీని నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముత్తోజు సుధాకర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీసీహెచ్ వెంకటేశ్వర్లు, వి.కొండయ్య, పి.శ్రీరామ్ శెట్టి, ఎం.పావని, జీవీ కృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, రఫి, బాలగురవయ్యను, మండల స్థాయి అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై, రాష్ట్ర కార్యదర్శి వి.వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, సులోచన, జయరామరెడ్డి, చెన్నారెడ్డి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి



పత్తికి పిచికారీ చేస్తున్న రైతు

రాచర్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. పురుగు మందు పిచికారీపై చేసే సమయంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు అనారోగ్యానికి గురవుతున్నారని ఏవో అన్నారు.

పాటించాల్సి జాగ్రత్తలు

పురుగు మందులు పిచికారీకి నేప్ స్నేక్ తైవాన్ స్ప్రేయర్లు మాత్రమే వాడాలి. మందుల పరిమానాన్ని బట్టి ఎకరాకు 200లీటర్ల నీటితో 5 ట్యాంకులు చొప్పున పిచికారీ చేయవచ్చు. లేబుళ్ల వివరాలు, వాటి పత్రాలు చదవాలి. నోటితో మందుల డబ్బాల మూతలు తీయకూడదు. పిచికారీ తర్వాత ఖాళీ డబ్బాలను పూడ్చిపెట్టాలి. మందులను చేతితో కలపకూడదు. కర్రను మాత్రమే ఉపయోగించాలి. మందు కొట్టే సమయంలో మద్యం, ధూమపానం, గుట్కాలు వాడొద్దు. ముక్కుకు మాస్క్ పలచటి వస్త్రాన్ని కట్టాలి. గాలి వీచే దిశకు ఎదురుగా పిచికారీ చేయకూడదు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో పిచికారీ మంచిది కాదు. చేతులు, కాళ్లకు గాయాలు, కురుపులు ఉన్నవారు ఆరోగ్యం సరిగా లేనివారు పిచికారీ చేయకూడదు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 90వేలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.1,90,942 వచ్చినట్లు ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.82,210, లడ్డు ప్రసాదం ద్వారా రూ.37,960, అన్నదాన విరాళాల ద్వారా రూ.53,739, పంచామృత అభిషేకానికి రూ.11,033, శ్రీపాద కానుకల ద్వారా రూ.60 వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

పామూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 9లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

పామూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రంగాల్లో రాణించి పలువురికి ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కందుకూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన మేధా గ్లోబల్ ఫ్లెక్స్ ప్రింటింగ్ షాపును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు బొల్లా నరసింహారావు, అంచూరి వెంకటరెడ్డి, యారవ శ్రీనివాసులు, హరిబాబు, పువ్వాడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

తాళ్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు రవిచంద్రారెడ్డి, గండూరి నాగరాజు, నారిపెద్ది శ్రీనివాసరావు, పోలంరెడ్డి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి హేయం

తాళ్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాన్‌పై దాడిని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య ఖండించారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టులో గవాన్‌పై దాడి చేయటం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను బార్ కౌన్సిల్ నుంచి శాశ్వతంగా తొలగించాలని ఆయన కోరారు. తక్షణం రాజేష్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

ముండ్లమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ఎం.శ్రీదేవి సోమవారం విధుల్లో చేరారు. నెల రోజుల క్రితం శిక్షణ నిమిత్తం బాపట్ల వెళ్ళారు. శిక్షణ పూర్తవ్వటంతో విధుల్లో చేరినట్టు ఎంపీడీవో తెలిపారు.

గత పాలకుల నిర్లక్ష్యం.. ప్రజాధనం వృథా

- అర్ధంతరంగా నిలిచిపోయిన భవనాలు
- చాలీచాలని గదులు
- విద్యార్థుల చదువుకు ఆటంకాలు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలన్నీ..

దర్శి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలతో అనేక పథకాలు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయింది. వైసీపీ పాలకుల అసమర్థతతో విద్యార్థుల చదువులకు ఆటంకాలు కలుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాలంలో ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకం ఆరంభశూరత్వంగా మిగిలిపోయింది. ఒక్క పాఠశాల భవన నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

దర్శి మండలంలో 164 పనులను రూ.18.72 కోట్లతో చేపట్టారు. అందులో 124 పనులు ప్రారంభించి రూ.12.40 కోట్లు ఖర్చు చేశారు. నిర్మాణం చేపట్టిన భవనాల్లో ఒక్కటీ పూర్తికాలేదు. పాఠశాలల వద్ద అసంపూర్తిగా మిగిలిన భవనాలు వెక్కిరిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు చేపట్టారు. దీంతో విద్యార్థుల సంఖ్య పాఠశాలల్లో పెరిగింది, ఈనేపథ్యంలో నిర్మాణం చేపట్టిన భవనాలు పూర్తికాక ప్రస్తుతం ఉన్న తరగతి గదులు చాలక విద్యార్థులు



దర్శి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మధ్యలో నిలిచిపోయిన భవనం



దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిపోయిన భవనం

ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకం పేరుమార్చి మన బడి-మన భవిష్యత్తుగా నామకరణం చేసింది. సర్వశిక్ష అభియాన్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభాసుపాలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేసే విషయంపై దృష్టిసారించ లేదు. ఇటీవల నూతన డీఎస్సీతో ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరిగింది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగాయి. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన భవన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

కనిగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలో విద్యాభివృద్ధి చెందాలన్నదే తన ముందున్న లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని మహాత్మా జ్యోతిభా పూలె రెసిడెన్షియల్ పాఠశాలలో మినరల్ ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తుందన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టల్‌లు, పాఠశాలల్లో మంచినీటి వసతి కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే వివిధ పథకాలు, వసతులను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ గిరిజ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అలంకారప్రాయంగా సచివాలయాలు

- ప్రారంభానికి నోచుకోని వైనం
- అసంపూర్తిగా మరికొన్ని నిర్మాణాలు

పామూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పామూరు మండలంలో 19 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో సచివాలయానికి రూ.35 లక్షల ప్రభుత్వ నిధులు వెచ్చించింది. వీటిల్లో ఏడు సచివాలయాలనే పూర్తిచేసి ప్రాంభించారు. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి. వాటిల్లో పడమట కట్టకిందపల్లి, బోడవాడ గ్రామ సచివాలయాలు కోర్టు కేసులతో నిలిచిపోయాయి. మిగిలినవి అర్ధంతరంగా ఆగిపోయాయి.



అర్ధంతరంగా నిలిచిపోయిన సచివాలయ నిర్మాణం

పామూరు పట్టణంలో నాలుగు గ్రామ సచివాలయాలకుగాను ఒకటవ సచివాలయాన్ని ప్రారంభించారు. 2వ సచివాలయం అంకాలమ్మవీధిలో దాత ఇచ్చిన చాలీచాలని ఇరుకు స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే, నిర్మాణ దశలోనే వదిలివేయడంతో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. దాంతో ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో 3, 4 సచివాలయాలు అన్ని హంగులతో పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా కూటమి పాలకులు స్పందించి సచివాలయాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

నాబార్డు ద్వారా రైతులకు రుణాలు

ముండ్లమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నాబార్డు ఆర్థిక సహాయంతో వ్యవసాయ రుణాలతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టటం జరుగుతుందని నాబార్డు డీడీఎం రవికుమార్ అన్నారు. సోమవారం మండలకేంద్రమైన ముండ్లమూరులోని సొసైటీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల రైతులకు అందిస్తున్న వివిధ రకాల పథకాలు, సేవల గురించి వివరించారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించటం జరగాలన్నారు. అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎం.శైలజ, మేనేజర్ వీరరాఘవులు, ఫీల్డ్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు సొసైటీ అధ్యక్షుడు మేదరమెట్ల వీరనారాయణ, సీఈవో సోమేపల్లి వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షుడు కంకణాల వెంకటరావు, ముండ్లమూరు, వేంపాడు, నాయుడుపాలెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.



సొసైటీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న నాబార్డు డీడీఎం రవికుమార్

టీడీపీ నేత కోటయ్యకు నివాళి

తాళ్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన మండలంలోని కొర్రపాటివారిపాలెంకు చెందిన టీడీపీ నాయకుడు కె.కోటయ్యకు సోమవారం ఆపార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మండల పార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యదర్శి మానం రమేష్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, కొర్రపాటివారిపాలెం సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి, రామయ్య, కైపు రామకోటిరెడ్డి, నాగార్జునరెడ్డి, పిన్నిక రమేష్, తదితరులు కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

అంధకారంలో పెద్దన్నపల్లి

- వీధిలైట్లు ఏర్పాటుచేయని పంచాయతీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

పీసీపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపల్లిలో అంధకారం నెలకొంది. గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం వేసిన వీధి లైట్లు ఫీజులు పోయి వెలగడంలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట వీధుల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నామని తెలిపారు. విషసర్పాలు, తేళ్లు వంటి కీటకాలు వీధుల్లో సంచరిస్తుండటంతో తిరగలేకపోతున్నామని తెలిపారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గంతో పాటు సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెలగని వీధి లైటు

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

వెలిగండ్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని గోకులం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణపావని తెలిపిన వివరాల మేరకు... పామూరు మండలం దాదారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్లపు సూజాతకు గోకులం చెందిన సూబ్బారెడితో 12 సంత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత నాలుగు నెలల నుంచి భార్య భర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో మనస్తాపానికి గురైన సుజాత సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ప్రయోజనం

పామూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొన్ని రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో సామాన్యులకు ధరల భారం తగ్గిందని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి అరవిందారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య డిప్యూటీ ఎంపీ డీవో సుందరరామయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, హెచ్ఎం పి.కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న సుశీల

కనిగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మిద్దె తోటల సాగులో కనిగిరి పట్టణానికి చెందిన మహిళ రాష్ట్రస్థాయి అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు చేతులమీదుగా సోమవారం విజయవాడలో అందుకున్నారు. పట్టణంలోని ఎన్జీవో కాలనీకి చెందిన కేతినేని సుశీల మిద్దె తోటల సాగు (టెర్రస్ గార్డెన్) పెంపకంలో ప్రత్యేకతను చాటుకుంది. మిద్దెలపై 500కు పైగా కాయగూరలు, పూల మొక్కలు, ఉద్యానసాగుకు చెందిన జామ, దానిమ్మ, బొప్పాయి, సపోటా, కొండ రేగు, మామిడి లాంటి మొక్కలను పెంచి వాటిని సంరక్షణలో విశిష్ట ప్రతిభను కనబరచింది. సేంద్రియ ఎరువులనే వినియోగించి పర్యావరణ సమతుల్యతకు పాటుపడ్డారు. సీఎం చేతులమీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవటం ఎంతో అనుభూతిని మిగిల్చిందని సుశీల పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించటం అన్యాయం

కనిగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించటం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్మికశాఖ కార్యాలయంలో అధికారి రామలింగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి నిబంధనలు పాటించకుండా కార్మికులను తొలగించటం సరికాదన్నారు. ఈవిషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్ళినా స్పందించటం లేదన్నారు. కార్యక్రమంలో శాంతరాజు, మోహన్, కొండయ్య, ధర్మేంద్ర, సాలమ్మ, పద్మ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో ప్రజలు సంతృప్తి



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

దొనకొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ముందుకు సాగుతున్నారని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా రూ.15వేలు నగదు పొందిన ఆటో డ్రైవర్లు బత్తుల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సోమవారం సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ ఆదేశాల మేరకు ఈ కృతజ్ఞత పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు షేక్ సుభానీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కేబుల్ వైరు చోరీ

ముండ్లమూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు గ్రామాల్లో 20 మంది రైతులకు చెందిన విద్యుత్ కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఆది, సోమవారాల్లో పొలాలకు వెళ్ళి మోటార్లు ఆన్ చేసేందుకు చూడగా కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన కాటూరి రమేష్ బాబు, వెంకటరావు, సాయిబాబు, కోటి నర్సిరెడ్డి, కాటూరి శ్రీనివాసులు, వీరాంజనేయులు, సాధు సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, గూడాల వెంకటేశ్వరరెడ్డి, మల్లు పోలిరెడ్డి, పసుపుగల్లుకు చెందిన కానాల అంజిరెడ్డి, చింతల శ్రీనివాసరెడ్డి, కొడపాల చినబ్రహ్మరెడ్డి, ఉన్నం రామారావుల మోటార్లకు చెందిన కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఒక్కో రైతుకు చెందిన నాలుగు మోటార్ల వైర్లు కూడా చోరీకి గురయ్యాయి.

రోడ్డుపైనే మురుగునీరు



తూర్పుగంగవరంలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

తాళ్లూరు,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): వాణిజ్యకేంద్రమైన తూర్పుగంగవరం గ్రామంలో తాళ్లూరుకు వెళ్లే మార్గంలో ఆంజనేయస్వామి గుడి సమీపాన మురుగు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈమార్గంలో మురుగు కాల్వలు లేవు. దీంతో ఆవీధిలోని ఇళ్లలోని మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మురుగునీటికి తోడు వర్షపునీరు వచ్చి చేరటంతో ఆంజనేయ స్వామిగుడి సమీపాన చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

తాళ్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరంలో స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. తాళ్లూరు, బొద్దికూరపాడు బస్టాండు సెంటర్లు, గ్రామంలో పలుచోట్ల అవగాహన లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో అవగాహనలేకుండా మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దీంతో మలుపులవద్ద వాహనాలను స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. చీమకుర్తి బస్టాండ్ సెంటర్, తాళ్లూరు బస్టాండ్ సెంటర్ మలుపుల వద్ద ద్విచక్రవాహనాలు, పెద్దపెద్ద వాహనాలు అదుపు చేయలేక వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులులేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష కోసం.. ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం తెలిపారు. ఇందుకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్ సైట్‌లో సంప్రదించాలన్నారు. పరీక్ష రుసుం 16 లోగా చెల్లించి.. డీఈఓ కార్యాలయంలో 18వ తేదీ లోగా సమర్పించాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, జడ్పీ పాఠశాలల్లో 8వ తరగతి చదువుచూ 7వ తరగతిలో 55 శాతం మార్కులు సాధించి, వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. పరీక్ష రుసుం రూ.100 లు కాగా, ఎస్సీ ఎస్టీలకు రూ.50 అని తెలిపారు.

పైకొచ్చిన.. పాతాళగంగ

- గణనీయంగా పెరిగిన భూగర్భ జలాలు
- అందుబాటులో 66.1 టీఎంసీల నీరు
- వ్యవసాయ బోర్లకు తీరిన నీటి కొరత
- పల్నాడు జిల్లాలో అత్యధికం

కురిసిన మేఘం.. ఊటెక్కిన భూమి!



నకరికల్లు వద్ద బోర్లతో పొలాలకు నీరు

వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. కాలువలకు పుష్కలంగా నీటి పరఫరా జరుగుతోంది. చెరువులు, కుంటలు నిండాయి. భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులకు జలకళ సంతరించుకుంది. ఎక్కడ చూసినా నీటి నిల్వలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. దీంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయ బోర్ల ద్వారా సమృద్ధిగా పంటలకు నీరు అందుతోంది. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలా లు 1.25 నుంచి 3 మీటర్ల లోతులోనే అం దుబాటులో ఉన్నాయి. 66.1 టీఎంసీ ల నీరు అందుబాటులోకి వచ్చింది.

(చీరాల, ఆంధ్రజ్యోతి)


భూగర్భ జల కొరత దాదాపు తీరింది. వేసవికి కొన్ని ప్రాంతాల్లో 37 మీటర్ల లోతుకు జలాలు పడిపోతుండేవి. దీంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయం విదితమే. ప్రస్తుతం అడుగంటిన వందలాది బోర్లకు మళ్లీ జలకళ సంతరించుకుంది. పల్నాడు జిల్లాలో ప్రధానంగా బొల్లాపల్లి, వెల్దుర్తి, మాచర్ల, దుర్గి మండలాల్లో వేసవిలో ప్రమాదకర స్థాయిలో భూగర్భ జలాలు పడిపోయాయి. ఈ ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం భూగర్భ జలమట్టం పెరిగింది. వేసవిలో జిల్లా సగటు భూనీటి మట్టం 11.08 మీటర్లు కాగా ప్రస్తుతం 8.46 మీటర్లకు జలాలు పెరిగాయి. సగటున 2.66 మీటర్ల మేర నీరు పైకొచ్చింది. దుర్గి మండలంలో 7.49 మీటర్లు, వెల్దుర్తిలో 7.43 మీటర్లు, యడ్లపాడులో 6.65 మీటర్లు, అత్యంత నీటి ఎద్దడి మండలమైన బొల్లాపల్లిలో 4.20 మీటర్ల మేర భూనీటి మట్టం పెరిగింది. మూడు మీటర్ల లోపు లోతులో భూగర్భ జలాలు జిల్లాలోని 38.95 శాతం ప్రాంతంలో లభిస్తున్నాయి. 28.42 శాతం ప్రాంతంలో మూడు నుంచి ఎనిమిది మీటర్లలో.. ఎనిమిది నుంచి 20 మీటర్ల లోతులో 23.16 శాతం.. 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో 9.47 శాతం.. ఉన్నట్టు భూగర్భ జలాల శాఖ వెల్లడించింది.

జిల్లాల వారీగా భూగర్భజల మట్టం

పల్నాడు సాధారణ వర్షపాతం 535.5 మి. మీ కాగా 560.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 35.90 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి.

బాపట్ల జిల్లా వేసవిలో సగటు భూ గర్భ నీటి మట్టం 3.93 మీటర్లు కాగా.. ప్రస్తుతం 2.96 మీటర్లకు చేరింది. 0.96 మీటర్ల నీటి మట్టం పెరిగింది. జిల్లా అంతటా నీటి మట్టం పెరగగా అద్దంకి, చినగంజాం, మార్టూరు నీటి మట్టం పెరగలేదు. మూడు మీటర్ల లోపు భూ నీటి మట్టం 65.31 శాతం.. మూడు నుంచి ఎనిమిది మీటర్ల లోపు 32.65 శాతం.. ఎనిమిది నుంచి 20 మీటర్లలోపు 2.04 శాతం ప్రాంతంలో నీరు ఉంది. కొల్లూ రు మండలంలో 3.94 మీటర్లు, వేమూరులో 3.04 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. బాపట్ల జిల్లా సాధా రణ వర్షపాతం 554.2 మి.మీ కాగా 514.6 మి.మీ నమోదైంది. జిల్లాలో 14.50 టీఎంసీల నీటి నిల్వలు అందు బాటులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలో వర్షాలు దంచి కొట్టాయి. దీంతో భూగర్భ నీటి మట్టం కూడా 3.69 మీటర్ల మేర పెరిగింది. వేసవిలో జిల్లా సగటు నీటి మట్టం 5.37 మీటర్లు కాగా 1.68 మీటర్లకు పెరిగింది. 81.08 శాతం మూడు మీటర్ల లోతులోనే నీరు ఉంది. 18.92 శాతం మూడు నుంచి 8 మీటర్ల లోపు నీరు లభిస్తోంది. చేబ్రోలు మండలంలో 7.16 మీటర్లు.. గుంటూరులో 5.38 మీటర్లు, కొల్లిపరలో 4.70 మీటర్లు, పెదకాకాని మండలంలో 4.07 మీటర్ల మేర నీటి మట్టం పెరిగింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 614.7 మి.మీ కాగా 825.5 మి.మీ నమోదైంది. జిల్లాలో 15.70 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులోకి వచ్చింది.



పరాధీనమైన జమ్ములపాలెం రోడ్డులోని అసైన్డ్ భూమి

అనధికార అసైన్డ్‌పై చర్యలేవి?

- అనధికార ఒప్పందాలతో పేదల భూముల చెర
- గత ప్రభుత్వ చట్ట సవరణతో.. వేల ఎకరాల పరాధీనం
- కూటమి కొలువుదీరిన కొత్తలో విచారణకు ఆదేశాలు
- నివేదికల సమర్పణతో సరి.. చర్యలు శూన్యం

వేల ఎకరాల ప్రభుత్వ భూమి..

బాపట్ల, చీరాల రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో దాదాపు 60 వేల ఎకరాల ప్రభుత్వ భూమి నాలుగు దశాబ్దాల క్రితం వరకు ఉండేది. ఇందులో దాదాపు ఇప్పటి వరకు 40 వేల ఎకరాలను పేదలకు అసైన్డ్ చేయగా, మరో 20 వేల ఎకరాలు అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. పేదలకు అసైన్డ్ చేసిన భూముల్లో ఇప్పుడు వందల ఎకరాలు కూడా ఒరిజినల్ అసైనీల చేతిలో లేకపోవడం గమనార్హం. నిరుపేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని వారికి తృణమో, పణమో ఇచ్చి అనధికారిక ఒప్పందాల ద్వారా ఏళ్ల తరబడి అసైన్డ్ భూములను బడా బాబులు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలి నాళ్లలోనే అసైన్డ్ భూ బాగోతాలపై దృష్టి పెట్టింది. అక్రమాలపై అవసరమైతే ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని మరింత పటిష్టం చేయడానికి కూడా వెనకాడబో మనే సంకేతాలను పంపింది. కానీ, ఇంతవరకు చర్యల విషయంలో ఒక్క అడుగు కూడా పడకపోవడంతో అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పేదలకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూమిపై ఎలాంటి క్రయ విక్రయాలు జరపడం, యాజమాన్య హక్కులు కల్పించడం నేరమని చట్టం స్పష్టంగా నిర్వచిస్తోంది. కానీ, జిల్లాలో ఇవేవీ అమల వుతున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదు. వేల ఎకరాల అసైన్డ్ భూమి పరాధీనమైంది. నిరుపేదలకు కేటాయిం చిన అసైన్డ్ భూమికి యాజమాన్య హక్కులు కల్పించే పేరిట వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణ పరపతి కలిగిన పెద్దలకు వరంగా మారింది. పైరవీలతో ఏకంగా అసైన్డ్‌ను ఫ్రీహోల్డ్ చేయించుకున్న ఉదంతాలు కోకొల్లలు. ఈ మొత్తం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి.. నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ క్రయవిక్రయాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇది వెలువడి కూడా ఏడు నెలలు దాటింది. తర్వాత రెవెన్యూ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వే జరిపి నివేదికలను ప్రభుత్వానికి అందించి నాలుగు నెలలు దాటింది. ఇక అంతే ఆ తర్వాత అసైన్డ్ అక్రమాలపై చర్యలేవి అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు లేవు. అసైన్డ్ అక్రమాలపై ఎలాంటి ముందడుగు పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అసైన్డ్ అక్రమాలు ఇలా..

ప్రభుత్వం నుంచి 2003 ముందు భూమి పొందిన పేదలు.. యాజమాన్య హక్కు పొందే విధంగా వైసీపీ ప్రభుత్వం చట్ట సవరణ చేసింది. దీనిని ఆసరాగా చేసుకుని దాదాపు 3,804 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇందులో దాదాపు 80 శాతం చేతులు మారిన (మిగతా 4వ పేజీలో)

చర్చి ఫాదర్‌తో.. సముద్రస్నానానికి వెళ్లిన వివాహిత మృతి

చినగంజాం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సముద్ర స్నానానికి వెళ్లిన యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మోటుపల్లి సముద్ర తీరం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శీలం రమేష్ వివరాల ప్రకారం.. బాపట్ల మండలం అడవి పంచాయతీ పరిధిలోని అడవిపల్లెపాలేనికి చెందిన ఓసిపిల్లి రాజు, శాంతికుమారి(29) భార్యభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు చేపల వేట చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాజు చేపల వేటకు వెళ్తూ.. నాలుగు రోజుల క్రితం వేటపాలెం మండలం పాత రెడ్డిపాలెంలోని తన భార్య చెల్లెలు దీనదనమ్మ నివాసంలో శాంతికుమారిని, పిల్లలను వదలి వెళ్లాడు. అడవిపల్లెపాలెంలోని చర్చిలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన నలగల వినమ్ ఫాదర్‌గా ఉన్నాడు. శాంతికుమారి చర్చికి వెళ్తూ ఉంటుంది. ఈ క్రమంలో వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడింది. సోమవారం ఇద్దరూ కలిసి మోటుపల్లి సముద్ర తీరప్రాంతానికి వెళ్లారు. సముద్రంలో అలల తాకిడికి ఇద్దరూ సముద్రంలో లోపలికి వెళ్లారు. వినయ్ బయటకు వచ్చినప్పటికీ, అలలకు చిక్కుకొని శాంతకుమారి మృతిచెందింది. ఎస్‌ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాంతి కుమారి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

40 శాతం ప్రకృతి వ్యవసాయ విస్తరణే లక్ష్యం

ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న బుడితి రాజశేఖర్

గుంటూరు సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతం అయ్యేందుకు ప్రభుత్వ అంకితభావమే ప్రధాన కారణమని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి బుడితి రాజశేఖర్ పేర్కొన్నారు. రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రంలో 40 శాతం ప్రకృతి వ్యవసాయం విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బ్రెజిల్ ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెండు రోజులుగా తూర్పు గోదావరి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన బ్రెజిల్, యూఏఈ, శ్రీలంక దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు తమ అనుభవాలు, పరిశీలించిన అంశాలను ఈ సమావేశంలో పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వస్తున్న సానుకూల మార్పు, ముఖ్యంగా మహిళలు పోషిస్తున్న క్రియాశీలక పాత్రను బృంద సభ్యులు ప్రత్యేకంగా ప్రశంసించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు, ప్రజా భాగస్వామ్యం, అంతర్జాతీయ పర్యటనలు సుస్థిర వ్యవసాయం బలోపేతంలో కీలక అంశాలని స్పష్టం చేశారు. బ్రెజిల్ వ్యవసాయ అభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన వివియన్ లిబోరియో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయంలో చేస్తున్న అగ్రో ఎకాలజీ ప్రయత్నాలు బ్రెజిల్‌లో కుటుంబ వ్యవసాయం, సహకార వ్యవస్థలు, రసాయన వినియోగం తగ్గించే చర్యలతో సమాన దిశలో సాగుతున్నాయన్నారు. "నౌ" పార్టనర్స్ వ్యవస్థాపకుడు వాల్టర్ లింక్, బ్రెజిల్ బృంద సభ్యులు జోయిస్ రెండు రోజుల క్షేత్ర పర్యటనలో మట్టి ఆరోగ్యం, సూక్ష్మజీవ శాస్త్రం, బయో స్టిమ్యులెంట్లు, సంవత్సరం పొడవునా భూమి రక్షణ పంటలు, తొమ్మిది ప్రకృతి వ్యవసాయ సూత్రాల అనుసంధానంపై నేర్చుకున్న పాఠాలను వివరించారు. అమెజాన్‌కు చెందిన మారియో బ్రాగా డి గోస్ వాస్కోన్సెలోస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వివిధ పర్యావరణ పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ నమూనాను అనుసరించేందుకు ఇది ఒక మార్గదర్శకంగా నిలిచిందన్నారు. సుస్థిర, పునరుత్పత్తి వ్యవసాయంలో రాష్ట్ర నాయకత్వాన్ని మరొకసారి నిర్ధారించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, ఇంటర్నేషనల్ కో- ఆప రేషన్ ఇన్‌చార్జి స్వాతి,సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రల పనితీరుతోనే జిల్లాకు అవార్డులు

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



కమిషనర్ జి.రఘునాథరెడ్డి, మెప్మా పీడీ సత్యఆనంద్‌పాల్‌కు అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రింబవళ్లు క్లాప్‌మిత్రలు పనిచేయడం ద్వారానే బాపట్ల జిల్లాకు విరివిగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు లభించాయని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర జిల్లా అవార్డుల ప్రధానోత్సవం సోమవారం సాయంత్రం జీబీసీ రోడ్డులోని కమ్మ జనసేవా సమితి కల్యాణ మండపంలో నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా గాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. రానున్న మూడు నెలల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. వ్యర్థాలను పద్ధతి ప్రకారం తొలిగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో జనవరి 25న ప్రారంభమైన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను సమర్థంగా ముగించుకున్నామన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర 2047 లక్ష్యాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి నెలా ఒక అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని లక్ష్యాల సాధన దిశగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పనిచేశారని ప్రశంసించారు. చెరుకుపల్లి మండలం కావూరు జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛత అవార్డు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వివిధ రంగాలకు 49 అవార్డులు లభించడం సంతోషదాయకమన్నారు. వీరంతా పరిశుభ్రమైన బాపట్ల జిల్లాకు రూపశిల్పులుగా ఉన్నారని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా ఎఫ్ఎస్‌టీపీలు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. 146 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాపుడా ఛైరన్ సలగల రాజశేఖర్‌బాబు, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటరమణ, చిన్న శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, డీపీఓ ప్రభాకరరావు, మెప్మా పీడీ సత్యానంద్ పాల్, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం

- మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు చెక్‌పోస్టు బాక్స్‌ల ఏర్పాటు
- వీటి నిర్వహణకు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు..
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీ పలు ప్రాంతాల్లో తనిఖీలకు చెక్ పోస్టు బాక్సులను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణ కోసం విద్యుత్ చౌర్యానికి పాల్పడుతోంది. విద్యుత్ శాఖ అధికారులు సాధారణ ప్రజలు.. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే నానా హడావుడి చేస్తారు. కానీ, ఇలా రోడ్ల వెంబడి ఇష్టానుసారం విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసి.. కనెక్షన్లు తీసుకున్నా.. ఎవరు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మైనింగ్ సీనరేజ్ వసూళ్లు చేసే చెక్ పోస్టులకు నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ మంజురయ్యే అవకాశాలు లేవు. అయినప్పటికి వారు విద్యుత్‌ను ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, మెయిన్ లైన్లు, గృహాలు, గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి ఇష్టానుసారంగా విద్యుత్‌ను పొందుతున్నారు.



వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి చెక్ పోస్టుకు విద్యుత్ కనెక్షన్

ఏఎంఆర్‌కు సీనరేజ్ వసూళ్ల బాధ్యత..

గ్రానైట్ మైనింగ్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. వారు ప్రతి నెలా ప్రభుత్వానికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీనరేజ్ వసూళ్లు చేసి రూ.47 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం ఏఎంఆర్ కంపెనీ బల్లికురవ, మార్టూరు, సంతమాగులూరు మండలాల పరిధిలో 35 చోట్ల వాహనాల తనిఖీలు, సీనరేజ్‌ల చెల్లింపులకు చెక్ పోస్టు బాక్సులను ఏర్పాటు చేసింది. ఈ బాక్సులలో సీసీ కెమెరాలు, ఫ్యాన్, కంప్యూటర్, బయట ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన విద్యుత్ పొందేందుకు.. ఎక్కడా మీటర్లు ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. మల్లాయపాలెం గ్రామ సచివాలయం నుంచి, అదే గ్రామంలో అంజనేయస్వామి దేవాలయం నుంచి మరో బాక్సుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. కొండాయపాలెం ప్రభుత్వ పాఠశాల నుంచి, వీర్ల గంగమ్మ దేవాలయం ముందు, బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో మెయిన్ విద్యుత్ తీగల నుంచి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. ఇలా మిగిలిన చెక్ పోస్టు బాక్స్‌లకు కూడా విద్యుత్‌ను అందిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం ఈ విద్యుత్ చౌర్యంపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు వెంటనే చెక్ పోస్టుల బాక్సులను తనిఖీ చేసి, అక్రమంగా పొందుతున్న విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని కోరుతున్నారు.



మల్లాయపాలెం గ్రామ సచివాలయం నుంచి ప్రైవేట్ చెక్ పోస్టుకు విద్యుత్ కనెక్షన్



విద్యుత్ మీటర్ లేకుండానే మెయిన్ లైన్‌పై ఏఎంఆర్ బాక్సుకు విద్యుత్ కనెక్షన్

నూతన రహదారిలో.. నిత్యం ప్రమాదాలు



పిడుగురాళ్ల - వాడరేవు రహదారి

చీరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వాడరేవు - పిడుగురాళ్ల 167/ఏ జాతీయ రహదారిలో రక్తధారలు కమ్ముతున్నాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రామాపురం, వాడరేవు పర్యాటక తీర ప్రాంతాలు కావడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో ఇక్కడికి పర్యాటకులు వస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు కొన్నిచోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అక్కడ నిర్మాణ దశలో ఉన్న ప్రాంతాలను అంచనా వేయడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు ప్రారంభం కాకుండానే పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

తాజాగా మూడు ప్రమాదాలు

గడచిన మూడు రోజుల్లో మూడు ఘోర ప్రమాదాలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం చీరాల - వాడరేవు రోడ్డులోని వాకావారిపాలెం జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని **అదుపు** తప్పిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాడరేవు రెడ్డికాలనీకి చెందిన బాలాజీరెడ్డి అనే వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. శనివారం రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో వాడరేవుకు చెందిన ద్విచక్ర వాహనదారుడు లక్ష్మణరెడ్డి(54) అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ప్రమాదంలో వాకావారిపాలేనికి చెందిన కర్నేటి నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. గత మేలో గుంటూరులోనికళాశాలకు**చెందిన** విద్యార్థులు రామాపురానికి వచ్చి.. ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో కారు ప్రమాదానికి గురయ్యారు. దీంతో ముగ్గురు మృతి చెందారు.

వేగాన్ని నియంత్రించాలి

రహదారి నిర్మాణంతోపాటు వాహనాల వేగానికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో అధికారులు ముందుగా రోడ్డు నిర్మాణ ప్రాంతంలో సూచికలు అత్యవసరంగా ఏర్పాటు చేయాలి. తద్వారా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాల వేగం తగ్గే అవకాశం ఉంటుంది.

రేషన్ బియ్యం పట్టివేత

పొన్నలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని ముప్పాళ్ల అడ్డరోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4వ తేదీ తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో పొన్నలూరు మండలం కనిగిరి నుంచి కందుకూరు వైపు వెళుతున్న మినీ ట్రక్కును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో 20 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. బియ్యాన్ని ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు అప్పగించగా, వారు దర్యాప్తు చేసి రేషన్ బియ్యంగా నిర్ధారించారని ఎస్‌ఐ అనుక్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దొంగతనం కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ దొంగిలించిన కేసులో మూటా నవీన్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ఎస్.కోమలివల్లి సోమవారం తీర్పు చెప్పారు. సంతనూతలపాడులో 2022 ఆగస్టు 14 రాత్రి రోడ్డు పక్కన పార్కు చేసి మందాడి సత్యనారాయణ నిద్రపోయాడు. దీంతో గుర్తుతెలయని వ్యక్తులు మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈమేరకు సత్యనారాయణ సంతనూతలపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశా రు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా ఒంగోలు జయప్రకాష్ కాలనీలో నివాసం ఉండే మూటా నవీన్ మోటార్ సైకిల్ దొంగిలించినట్లు గుర్తించారు. అతనివద్ద మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసి కోర్టులో పోలీసులు చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణకుమార్ తమవాదనలు వినిపించారు.నవీన్‌పై దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

సీపీవోగా సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అర్థికగణాంక అధికారి(సీపీవో)గా సుధాకర్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ సిటీస్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లాకు వచ్చారు. సీపీవోగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డిని ఆ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

లోగ్రేడ్ పొగాకు కిలో రూ.69

- లబోదిబోమంటున్నరైతులు

ఒంగోలు(రూరల్), అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో సోమవారం జరిగిన వేలంలో లోగ్రేడ్ పొగాకు కిలో కనిష్ఠ ధర రూ.69కి వ్యాపారులు కొనుగోలు చేశారు. నాణ్యమైన పొగాకును కిలో గరిష్ఠ ధర రూ. 315కు వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతులు వద్ద గల లోగ్రేడ్ పొగాకును వేలంకు 80శాతం పైగా తీసుకురాగా ఇదే అదునుగా భావించిన పొగాకు వ్యాపారులు వేలంలో సిండికేట్ అయి అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీంతో పొగాకు రైతులు ఏమి చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. సోమవారం వేలంకు మొత్తం 1,510బేళ్లు రాగా 1,318 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు.130 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

ఎదురొచ్చిన మృత్యువు

- 108 వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం



లక్ష్మయ్య మృతదేహం

పెద్దారవీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆప దలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఎస్.కొత్తపల్లి పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దోర్నాల మండలం రామచంద్రకోటకు చెందిన బొమ్మనబోయిన కొండలరాజు (18), ధనంకుల లక్ష్మీనారాయణ (23) సొంత పనుల నిమిత్తం మోటార్ సైకిల్‌పై సోమవారం ఉదయం మార్కాపురం వచ్చారు. పనులు ముగించుకొని తిరిగి రామచంద్రకోటకు బయల్దేరారు. పెద్దారవీడు, ఎస్.కొత్తపల్లి మధ్య మూలమలుపులో వారి బైక్‌ను ఎదురుగా వస్తున్న 108 వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్‌ఐ సాంబశివయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



కొండల రాజు మృతదేహం

శనగలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

క్వింటాకు రూ.10 వేలు ఇవ్వకుంటే ప్రభుత్వమే రూ.3వేలు బోనస్ ప్రకటించాలి

దేశీయపంటల ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : శనగ పంటకు క్వింటాకు రూ.10వేలు గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో క్వింటాకు రూ.3వేలు బోనస్ ప్రకటించాలన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు ఏపీ రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ధర్నాలో మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రెండేళ్లుగా శనగ పంటకు గిట్టుబాటు ధరలు లేక కోల్డ్ స్టోరేజీల్లో 91వేల టన్నులు నిల్వ ఉన్నాయన్నారు. గత ఏడాది రూ.10వేల వరకు ధరలు కలిగినా కొనుగోలు మాత్రం నామమాత్రంగానే జరిగాయని చెప్పారు. క్వింటా పంట ఉత్పత్తి ఖర్చు రూ.7వేలపైనే ఉందన్నారు. క్వింటా శనగలు రూ.10వేలకు అమ్ముకుంటేనే కౌలు రైతు పరిస్థితి ఒక రకంగా ఉంటుందని తెలిపారు. ధరలు లేకపోవడంతో రైతులు రోడ్డునపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జే జయంతిబాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎగుమతి, దిగుమతి విదానం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎగుమతులపై నిషేధాజ్ఞలు ఎత్తివేయాలని కోరారు. రాష్ట్రంలో ఒక దశ, దిశలేకుండా పాలన సాగుతోందని విమర్శించారు. రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఈ ఏడాది బర్లీ రైతులు, వర్జీనియా పొగాకు రైతులు, శనగ, మిర్చిరైతులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏ పంటకు సరైన ధరలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అనంతరం కలెక్టర్ రాజాబాబును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు కూలీ సంఘం ఉపాధ్యక్షుడు పరిటాల కోటేశ్వరరావు, పలు రైతు సంఘాల నాయకులు, రైతులు ఉన్నారు.

సంతలకు ఆదరణ అదరహో



కూరగాయలు కొంటున్న మహిళలు

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి) : పాత రోజుల్లో అనేక గ్రామాలలో, పట్టణాలలో వారానికో రోజు సంత జరుగుతుండేది. ఆ రోజు వివిధ ప్రదేశాల నుంచి నిత్యావసరాలు, రైతులు తమ పొలాల్లో పండిన కూరగాయలు తెచ్చి సంతలో అమ్ముతుండేవారు. ప్రజలు సంతకు వెళ్లి వారానికి సరిపడా కూరగాయలు కొనే వారు. ఇప్పుడు ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని కొన్ని పట్టణాలలో ఇదే తరహాలో సంతలునడుస్తున్నాయి. పల్లెటూళ్ల నుంచి వివిధ రకాల కూరగాయలను మినీ ట్రక్కులలో తెచ్చి వారానికి ఒక రోజు లేదా రెండు రోజులు అమ్మకాలు సాగిస్తున్నారు. చాలామంది ఒకే ప్రదేశంలో వారు ఎంచుకున్న రోజులలో కూరగాయల అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలో సోమ, శుక్రవారం సాయంత్ర సమయాలలో ఈ విధమైన అమ్మకాలు ఉంటాయి. ఇక్కడ మరొక విశేషం ఏమిటంటే ఏ రకం కూరగాయలైన ఒకే ధరకు విక్రయిస్తున్నారు. అదే మార్కెట్‌కు లేదా రైతుబజార్‌కు వెళితే ఒక్కో రకం కూరగాయలకు ఒక్కో ధర ఉంటుంది. ప్రస్తుతం ఇలా రోడ్డు పక్కన అమ్మకాలు సాగించేవారు ఏ రకమైనా కిలోకి ఒకే ధర నిర్ణయిస్తారు. కావలసిన కూరగాయలన్నింటినీ ఆ కవర్లో వేసుకుని తూకం పెడతారు. ఎన్ని కిలోలు ఉంటే ఆ రోజు ధరను బట్టి డబ్బులు చెల్లించటమే. ఒంగోలు నగరంలో దక్షిణ బైపాస్, ఉత్తర బైపాస్, మామిడిపాలెం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు చుట్టుపక్కల ఇటువంటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే మహిళలు సైతం ఇంటికి వెళ్లేటప్పుడు వీటిని కొని తీసుకు వెళ్తున్నారు. ఇలా విక్రయాలు చేసేవారికి షాపుల అద్దెలు, కరెంటు బిల్లులు లేకపోవటంతో వారు మార్కెట్, రైతుబజార్ కన్నా తక్కువ ధరకు ఇస్తున్నారు.

బాగుపడే 'దారేదీ'

- కొండపి నుంచి అనకర్లపూడి వరకు రోడ్డు అధ్వానం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- వాహనదారులకు అవస్థలు



అధ్వానంగా కొండపి నుంచి అనకర్లపూడి రోడ్డు



అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు గోతులమయమైన రోడ్డు

కొండపి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొండపి నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డు నరకప్రాయంగా మారింది. గోతులమయం కావడంతో ప్రయాణానికి ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా కొండపి నుంచి అనకర్లపూడి వరకు మూడు కిలోమీటర్లు రోడ్డులో వెళ్లాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. తారురోడ్డు పూర్తిగా దెబ్బతినడంతోపాటు మార్జిన్లు కూడా గోతులమయమై ఎదురెదురు వాహనాలు ఎటువెళ్లాలో తెలియని దుస్థితి. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు మరీ దారుణం

అలాగే అట్లేరు నుంచి అనకర్లపూడి వరకు 2 కి.మీ రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఈరోడ్డులో చీమకుర్తి ప్రాంతం నుంచి భారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. ఆ వాహనదారులు తమ సౌకర్యం కోసం.. దెబ్బతిన్న రోడ్డ మార్జిన్లు దొరికిన మట్టిని పోసి గోతులు పూడ్చారు. ఆ మట్టి వర్షాలకు బురదగా మారింది. వాహనాల టైర్ల తిరుగుతుండడంతో రోడ్డుపై గాడులు పడి, వాహనదారులకు మరింత అసౌకర్యం కలిగిస్తున్నాయి. ప్రధానంగా భారీ వాహనం ఎదురు వచ్చినపుడు మార్జిన్ దిగిన మోటార్‌సైకిల్ టైర్లకు మట్టి చుట్టుకుపోయి పడిపోతున్నారు. నెలరోజుల కిందట ఓ ద్విచక్ర వాహనదారుడు బస్సు కన్నా ముందుకు వెళ్లాలని మార్జిన్‌లోకి దిగి తిరిగి రోడ్డు ఎక్కబోయి అదుపు తప్పి బస్సుకింద పడిపోయి ప్రాణాలు విడిచాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈరోడ్డులోని గ్రామాల ప్రజలు ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వచ్ఛ సమాజ సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ఘనంగా స్వచ్ఛ పురస్కారాల ప్రదానోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు, వేదికపై ఎమ్మెల్యే దామచర్ల, ఒడా చైర్మన్ రియాజ్, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతను జీవన విధానంగా సమాజం మార్చుకునేందుకు ఉద్యమ స్థాయిలో ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఒంగోలులోని జీజీహెచ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రదానం చేస్తోందన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ అవార్డులను అందజేస్తుందని చెప్పారు. ఈ క్రమంలో జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మూడు, జిల్లా స్థాయిలో 49 అవార్డులు లభించాయన్నారు. సింగపూర్ ప్రసిద్ధి చెందడానికి స్వచ్ఛతే ప్రధాన కారణమని కలెక్టర్ చెప్పారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వచ్ఛతపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్రలో ఈ వేస్‌లో ఒంగోలు కార్పొరేషన్‌కు ఇటీవల అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకతను తెలియజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ మన ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛత, పరిశుభ్రత, మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతతో పరిసరాల పరిశుభ్రతతోపాటు ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుందన్నారు. అనంతరం అవార్డులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, స్వర్ణాంధ్ర ఆవిష్కరణపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన గీతాన్ని గాయకుడు నూకతోటి శరత్‌బాబు స్వర కల్పన చేసి ఆలపించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో పురస్కారాల ప్రదానోత్స కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకటత్రివినాగ్, డీఆర్వో చిన ఓబులేశ్, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అమరావతిపై పాట ఆవిష్కరణ

రాజధాని అమరావతిపై నగర కమిషనర్ కే వెంకటేశ్వరరావు రచించిన పాటను కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత ఆవిష్కరించారు. గాయకులు నూకతోటి శరత్ ఆలపించగా, కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, అమరావతి రాజధానిపై రచించిన గీతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అంకితమిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

- ఈ నెల 25 వరకు అవకాశం
- 30లోపు ఆర్ఎస్‌కేలలో జాబితాలు
- ఇప్పటివరకు 48.98శాతం నమోదు
- అత్యధికంగా మద్దిపాడులో 80 శాతం
- పలు మండలాల్లో వెనుకబాటు



ముండ్లమూరులో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న డీఏవో(ఫైల్)

ఒంగోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. తొలుత ఖరీఫ్ సీజన్ ముగిసే సెప్టెంబరు 30 వరకే గడువు ఇచ్చింది. అయితే సగం విస్తీర్ణం వివరాలు కూడా నమోదు కాలేదు, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే ఉండటంతో ఈనెల 25 వరకు గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వపరంగా రైతులకు ఇచ్చే రాయితీలు, ఇతరత్రా అన్ని విషయాల్లోనూ ఈక్రాప్ నమోదు ప్రధానమైనదన్న విషయం విదితమే. గతంలో కేవలం పంటల సాగు విస్తీర్ణాన్ని మాత్రమే ఈ క్రాప్ నమోదు చేసేవారు. ఈ ఏడాది నుంచి పంటలు సాగు జరిగినా, లేకపోయినా.. ప్రభుత్వ, బీడు భూములు అయినా ఒక్క ఫారెస్టు భూమి మినహా సర్వే నంబరు కేటాయించిన అన్నిరకాలను ఈ పంట నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నమోదు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో వెబ్‌ల్యాండ్ ప్రకారం మొత్తం 15,36,444 ఎకరాల భూమి ఈ-పంటలో నమోదు చేయాల్సి ఉంది. ఆ మేరకు ప్రభుత్వం నుంచే మండలాల వారీ భూవిస్తీర్ణం వివరాలు వ్యవసాయ శాఖకు అందాయి. అందులో ఇప్పటివరకు 7,40,416 ఎకరాల (48.98శాతం) విస్తీర్ణం వివరాలను అధికారులు నమోదు చేశారు. తొలుత గడువు ఇచ్చిన సెప్టెంబరు ఆఖరు వరకు చూస్తే 45శాతం మాత్రమే నమోదైనట్లు సమాచారం. కొన్ని మండలాల్లో వేగవంతంగా సాగుతున్నా మరికొన్ని మండలాల్లో తీవ్రజాప్యం జరుగుతోంది.

మద్దిపాడు మండలంలో 80.08శాతం నమోదు

అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో అత్యధికంగా మద్దిపాడు మండలంలో 80.08శాతం ఈ-క్రాప్ నమోదైంది. అది ఎర్రగొండపాలెంలో 76.50శాతం, గిద్దలూరులో 72.21శాతం, ఎన్‌జీపాడులో 69.98శాతం, త్రిపురాంతకంలో 63.73శాతంగా ఉంది. అత్యల్పంగా దర్శి మండలంలో 33.08శాతం విస్తీర్ణంలో నమోదవగా పుల్లలచెరువులో 33.63శాతం, తాళ్లూరులో 34.84శాతం, తర్లుపాడులో 34.87శాతం, సీఎస్‌పురంలో 35.98శాతం చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 25 వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆ వివరాలను గ్రామస్థాయిలోని రైతు సేవా కేంద్రాలలో ఈనెల 26 నుంచి 30 వరకు ప్రచురించి లోటుపాట్లు ఉంటే సవరిస్తారు. అనంతరం 31న తుది జాబితాలను ప్రచురిస్తారు. పెంచిన సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఈ-పంట నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తిచేయాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) సీహెచ్.శ్రీనివాసరావు సూచించారు. అలాగే రైతులు కూడా సిబ్బందికి సహకరించాలని కోరారు.

చీరాల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ఇరువురికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

హుటాహుటిన వైద్యశాలకు తరలింపు



అపస్మారక స్థితిలో రత్నబాబు



దానియేలును హాస్పిటల్‌కు తరలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్, స్థానికులు

తోటవారిపాలెం(చీరాల), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారిపాలెం వద్ద 216 జాతీయ రహదారి వెంబడి సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం.... ఒంగోలు నుంచి బాపట్ల వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన నక్క రత్నం, దానియేలుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురు బాబాయి అబ్బాయి వరుస అవుతారు. ప్రమాదంలో ఇరువురు అపస్మారక స్థితికి చేరారు. సమాచారం అందుకున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది, స్థానికుల సహకారంతో క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు పక్కన పొలాల్లోకి దూసుకుపోగా, అందులోని భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు.

బైకును ఢీకొన్న కారు

మార్టూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై విజయవాడ నుండి ఒంగోలు వైపు వెళుతున్న కారు రోడ్డుప్రక్కన ద్వి చక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటన సోమవారం సాయంత్రం మండల పరిదిలో రాజుపాలెం కూడలి వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో హైవే రోడ్డుపనులు చేస్తున్న ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు కూలీలకు గాయాలయ్యాయి.అనంతరం వారిని హైవే అంబులెన్స్‌లో చిలకలూరిపేట లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.పూర్తి సమాచారం తెలియాల్సిఉంది.

గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు

- 129 మంది విద్యార్థుల హాజరు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అద్దంకి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఆధునిక గ్రంథాలయాలు ఆవశ్యకతపై అద్దంకి గ్రంథాలయ భవన సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం అద్దంకిలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 129 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హాజరైన విద్యార్థులందరికి పరీక్ష అట్టలను అందజేశారు. విజేతలకు 11వ తేది బహుమతులు అందజేయనున్నట్లు ఎంఈవో కేవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు శ్రీనివాసమూర్తి, గురవయ్య, పెంట్యాల గంగాధర్, అర్జున్, సుజాత, అద్దంకి గ్రంథాలయ భవన సాధన సమితి కార్యదర్శి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార అసైన్డ్‌పై చర్యలేవి ?

(3వ పేజీ తరువాయి)

అసైన్డ్ భూమేననేది సమాచారం. ఆగమేఘాల మీద దాదాపు 280 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగినట్లు రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికలో పొందుపరిచారు. రాజకీయ పరపతిని ఉపయోగించుకుని గత ప్రభుత్వంలో దాదాపు 1,500 ఎకరాల అసైన్డ్ భూమిని గుట్టుచప్పుడు కాకుండా ఫ్రీహోల్డ్ చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తంతు ఇప్పుడు కూడా నడుస్తూ ఉండడం ఆందోళన కలిగించేదిగా ఉంది. అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు మత్స్యశాఖ లెక్కల ప్రకారం 2,800 ఎకరాలుగా తేలింది. ఈ సంఖ్య 8 వేల ఎకరాల వరకు ఉండొచ్చని సమాచారం. ఈ సాగు మొత్తం అనధికారిక ఒప్పందాల ద్వారా అసైన్డ్ భూమిని చెరబట్టిన వారే చేస్తుండడం గమనార్హం. బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్న భూమి అసైన్డ్ కాగా, దానిని విరాళం ఇచ్చారని చెప్పి గత ప్రభుత్వంలో సన్మాన సత్కారాలకు తెరతీయడం ఓ వింత. ఇక కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చూస్తే.. చట్టాలంటే లెక్కలేని తనానికి నిదర్శనంగా కనబడుతోంది. వీరికి గత పాలకుల అండదండలు లభించడం మరో విశేషం. వివిధ వేదికల మీద టీడీపీ నేతలు నిర్వహించిన ప్రజాదర్బార్‌లలో ఏకంగా 850 ఫిర్యాదులు రాగా ఇందులో 70 శాతం అసైన్డ్ లావాదేవీలకు సంబంధించినవే ఉండడం విస్తుగొలిపేదిగా ఉంది.

ఎందుకీ జాప్యం...

రెవెన్యూ విభాగం ఇచ్చిన నివేదికల్లోనే అసైన్డ్ అక్రమాలు నిజమని తేలింది. గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలు పాలకుల దగ్గర ఉన్నాయి. వీటన్నింటిని ప్రభుత్వం నిబంధనల ప్రకారం తిరిగి స్వాధీనం చేసుకుంటే వేల ఎకరాల ల్యాండ్ బ్యాంకుగా మారనుంది. జిల్లాను పారిశ్రామికంగా అత్యున్నత స్థాయిలో నిలపడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. మరెంతో మంది నిరుపేదలకు ఆ భూమి వరంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అసైన్డ్ అక్రమాలపై కొరడా ఘుళిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మహిళా మార్ట్‌లో అవినీతిపై నేడు విచారణ

- హాజరుకావాలని పలువురు ఉద్యోగులకు నోటీసులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలులోని మహిళా మార్ట్‌లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ జరగనుంది. పొదుపు సభ్యుల భాగస్వామ్యం, దాతల సహకారంతో సుమారు రూ.68లక్షల వ్యయంతో రెండేళ్ల క్రితం మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. అందులో భారీగా అవినీతి, నగదు దోపిడీ జరిగింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్‌తేజ్ స్పందించారు. విచారణ కమిటీని నియమించారు. ఆ మేరకు నెల్లూరుకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలారాణి బృందం విచారణ ప్రారంభించింది. గత నెలలో ఒంగోలు వచ్చిన విచారణ కమిటీ పలు రికార్డులు స్వాధీనం చేసుకుంది. మంగళవారం చేపట్టబోయే విచారణకు మార్ట్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు నిర్వహణ బాధ్యతలు చూసిన సీఎం ఎంలు, సీవోలు, ఐబీలు, సిబ్బంది హాజరుకావాలని ఆదేశించింది. దీంతో మెప్మాలో పనిచేసి బదిలీపై వెళ్లిన వారితోపాటు, ప్రస్తుతం ఉన్న వారిలో 30మందికిపైగా సిబ్బంది ఉదయం 11 గంటలకు ఒంగోలులోని కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని పీడీ శ్రీహరి నోటీసులు జారీ చేశారు.

అవీ..ఇవీ..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఆ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దండుబాట రోడ్డు, జయశంకర్ నగర్, పాలేటీ నగర్, ఉజిలీపేట, ప్రకాష్‌నగర్ ట్యాంకు ప్రాంతాల్లో అలాగే మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు తోటవారిపాలెం, ముంతావారిసెంటర్, కూరగాయల మార్కెట్, చీరాల మసీదు సెంటర్, గడియారస్తంభం సెంటర్, బెస్తపాలెం, తెల్లగాంధీబొమ్మ సెంటర్‌లో అంతరాయం ఉంటుందని, అనంతరం యధావిధిగా సేవలు అందుతాయని అధికారులు తెలిపారు.

లక్ష్యం మేరకు పండ్ల తోటలు సాగు చేయాలి

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు గ్రామాలలో రైతులు పండ్ల తోటలు సాగుచేసేలా వారికి సిద్ధం చేయాలని డ్వామా ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్ అన్నారు. సోమవారం బల్లికురవలో అన్ని గ్రామాల ఉపాధి క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. 2025- 26 సంవత్సరాలకు గాను 101 ఎకరాల్లో పండ్లతోటలు సాగుచేసేలా ఇప్పటికే అంచనాలు తయారు చేసి ఇచ్చారని వారు వెంటనే పండ్లతోటలు సాగు చేయాలన్నారు. గత ఏడాది కూడా పలు గ్రామాలలో ప్లాంటేషన్‌లో అవకతవకలు జరిగాయని ముందుముందు ఇలా జరగకుండా పటిష్టంగా సిబ్బంది నిజమైన రైతులను గుర్తించి వారితో పండ్ల మొక్కలు నాటించాలన్నారు. మొక్కలు లేకుండా బిల్లులు పెడితే చర్యలు తప్పవు అన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

పోషణపై తల్లులకు అవగాహన


పిల్లల తల్లులతో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

యద్దనపూడి, (మార్టూరు) అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):పూర్వ బాలారంభవిద్యపై పిల్లల తల్లులకు ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర అవ గాహన కలిగించారు. సోమవారం పోషణ మహా కార్యక్రమంలో భాగంగా యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈసీసీఈ పై తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సూపర్ వైజరు సుజాత అధ్యక్షత వహించగా,ముఖ్య అతిదిగా సుభద్ర విచ్చేశారు.అనంతరం జీఎస్టీపై రోజువారీ ఉపయోగించే వినియోగవస్తువులపై మరియు ఎలక్ట్రానిక్ పరికరాలపై తగ్గిన పన్ను గురించి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు బి కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ అధికారి తానియా,అంగన్వాడీ కార్యకర్తలుజి నవమ్మ,బి వసంతలక్ష్మి,జి కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన

ఇంకొల్లు, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మానసిక ఆరోగ్యానికి మూలమని బాపట్ల జిల్లా ఆరోగ్య కౌన్సిలర్ ప్యారిజాన్ అన్నారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆహారపు అలవాట్లపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు విద్యార్థుల మానసిక సమతౌల్యంతో పాటు దృష్టి కేంద్రీకరణ ఆత్మవిశ్వాసం పెంచుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ కిటకిట



అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

అద్దంకి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు కుటుంబ సభ్యులతో స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోయాయి. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం నుంచే రద్దీ మొదలైంది. సోమవారం ప్రయాణికులు మరింత పెరిగారు. ఆదివారం అద్దంకి డిపో కు సుమారు రూ.16,14,648 ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జ్ డీఎం మహబూబి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళాశక్తి పథకంతో మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. విజయవాడ, శ్రీశైలంలకు నడిచే ఎక్స్‌ప్రెస్‌లతో పాటు గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లెవెలుగు బస్సులలో కూడా ప్రయాణికుల రద్దీ కొనసాగింది. ఆదివారం 115 శాతం ఓఆర్‌తో రూ.16,14,648 ఆదాయం వచ్చింది. సోమవారం కలెక్షన్ రూ.18 లక్షలు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మధ్యాహ్నం సమయంలో కూడా ప్రయాణికులు కిక్కిరిసి పోయారు. ఉదయం, సాయంత్రం సమయాలలో రద్దీ మరింత ఎక్కువగా ఉంది.

నూలుమిల్లులో వ్యక్తి అనుమానాస్పదమృతి

ఇంకొల్లు, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఇంకొల్లులోని ఎన్ఎస్ఎల్ నూలు మిల్లులో సోమవారం చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళ్లితే కారంచేడు మండలం కేశవరప్పాడు ఎస్సీ కాలనీకి చెందిన నేలపాటి కోటేశ్వరరావు(67) చాలా కాలంగా నూలుమిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం యథావిధిగా ఇంటి వద్ద నుంచి విధులకు హాజరయ్యారు. వీవింగు విభాగం దగ్గరలోని భూగర్భంలోని ఓ గదిలో ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతిచెందాడు. నూలుమిల్లు యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. సీఐ వై.వి రమణ్య, ఎస్సై సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని వారు తెలిపారు.

'జీవనజ్యోతి బీమా' సొమ్ము అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బీమా పథకాలలో నమోదు చేసుకోవాలని బల్లికురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ శీనానాయక్ కోరారు. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన బండారు బ్రహ్మయ్య అను రైతు స్థానిక బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా పథకంలో నమోదు అయి ఉన్నారు. అయన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భీమా పథకం ద్వారా మంజురైన రూ.2 లక్షల చెక్కును మృతుని భార్య అరుణకు బ్యాంకు మేనేజర్ అందించారు. ఈసందర్భంగా అయన బీమా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు బిందుమాధవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమ్నాకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.





బల్లికురవ మండలంలో చెన్నుపల్లి చెరువు నుంచి పంట పొలాల్లోని ప్రవహిస్తున్న వరదనీరు, కొండాయపాలెం చప్టాపై నీరు, పంటపొలాల్లో నిలిచిన నీటిలో చేపలు పడుతున్న జాలర్లు, నీటమునిగిన వరిపైరు

దంచి కొట్టిన వాన

- పొంగి పొర్లిన వాగులు, చెరువులు
- పలు మార్గాల్లో నిలిచిన రాకపోకలు
- అధిక వర్షంతో వరి పైరుకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

బల్లికురవ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం దంచి కొట్టింది. ఈ ప్రభావంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. వాగులు చెరువుల నుంచి నీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ ఏడాదికి ఇదే పెద్ద వర్షం అని ప్రజలు పేర్కొంటున్నారు. భారీ వర్షంతో గ్రామాలలో ఉన్న మురుగు కాలువలపై నుంచి నీరు ప్రవహించింది. చెన్నుపల్లి కొండాయపాలెం గ్రామాల మధ్య చెరువు అలుగు నీరు ఉధృతితో రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది పడ్డారు. అలానే కొండాయపాలెం గ్రామంలో 50 ఎకరాల వరినాట్లు నీటమునిగాయి. చెన్నుపల్లి చెరువు నిండి నీరు పెద్ద పెట్టున రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. చెరువలలో ఉన్న చేపలు సైతం నీటి నుంచి బయటకు రావడంతో చేపలు పట్టుకోనేందుకు జాలర్లు దూర ప్రాంతాల నుండి తరలి వచ్చి పట్టుకున్నారు. పలు చోట్ల కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయి. గుంటుపల్లి ముక్తేశ్వరం గ్రామాల మధ్య నేల చప్టాపై నుంచి మూడు అడుగుల మేర నీరు పారింది. రాకపోకలు నిలిచి పోయాయి. కొణిదెన ఉప్పువాగులూరు రోడ్డులో నేలచప్టాపై నుంచి వర్షపు నీరు రావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షం వలన గ్రామాలలో వాగుల నుండి నీరు పెద్దపెట్టున రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోఏళ్ల తర్వాత వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని రైతులు అంటున్నారు.

కొప్పెరపాడులో భారీ వర్షం

మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో భారీ వర్షం కురిసింది. ప్రజలు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు. ఎస్సీ కాలనీ నుంచి వర్షపునీరు బయటకు వెళ్లే కాలువ లేకపోవడంతో వర్షపు నీరు గృహాలలోకి చేరింది. అలానే రోడ్డుపై నుంచి నీరు పారడంతో ప్రజలు గృహాలలో నుంచి బయటకు వచ్చేందుకు భయపడిపోయారు. అలానే ఉన్నత పాఠశాల పక్కవీధిలో వర్షపు నీరు రోడ్డుపై పెద్ద ఎత్తున నిలబడడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. విద్యార్థులు పాఠశాలకు నీటిలో నుంచే రావాల్సి ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై చేరిందని ప్రజలు అంటున్నారు. ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి సమస్య ఉందని వర్షం కురిస్తే చాలు నీరు గృహాలలోకి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు వెంటనే వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

పర్చూరు : రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు కాలనీలు, శివారు ప్రాంతాలు జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. రహదారుల్లో ఎక్కడ చూసినా నీటితో నిండిపోయి రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందిగా మారింది. వర్షాలతో పర్చూరు వాగుకు భారీగా నీరు చేరింది. ఇటీవల వాగు కరకట్టలను అభివృద్ధి చేయడంతో కొంతవరకు వరద ముప్పు తప్పింది. అయితే కొంతభాగం కరకట్టలు బలహీన పడడంతో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వాగు కరకట్టలను మరింత పటిష్టంగా నిర్మిస్తే పంట పొలాలు ముంపుకు గురికాకుండా కాపాడుకోవచ్చని అన్నదాతలు అంటున్నారు. ఆ దిశగా వాగు కరకట్టలను పటిష్టతపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలంలోని తాగు, సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని గ్రామాలలోని ప్రతి చెరువులో నీరు 90 శాతం వరకు చేరింది. మండలంలో 15 చెరువులు ఉన్నాయి. కొన్నిరోజుల నుంచి సాగర్ జలాలు రావడంతో వాటితోనే చెరువులను చాలా వరకు నిండాయి. దీనికితోడు అడపాదడపా కురుస్తున్న వర్షాలకు, ఆదివారం కురిసిన భారీ వర్షానికి మరింతగా చెరువులు నిండాయి. వాస్తవంగా అనంతవరం చెరువు 55 శాతం నిండగా, ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి 90 శాతానికి పైగా చెరువు నిండింది. అదేవిధంగా యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, శ్యామలవారిపాలెం, యనమదల తదితర గ్రామాలలోని చెరువులలో నీళ్ల సమృద్ధిగా చేరాయి. ఇక వర్షాలకు పోలూరు వాగు తూముల చప్టాపై నుండి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సోమవారం పోలూరు గ్రామానికి మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. వాగు నీటిప్రవాహం ఉధృతంగా ఉన్నందున పోలీసు, రెవెన్యూ అధికారులు వాగును దాటకుండా ప్రజలను కట్టడిచేశారు. చిన్నవాగులలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. యనమదల గ్రామంలో ఎస్సీ కాలనీలో భారీ వర్షం కారణంగా కాలనీలో మూడు అడుగులకు పైగా నీళ్ల నిలిచాయి.

పొంగిన కప్పలవాగు.. నిలిచిన రాకపోకలు

ఇంకొల్లు : మండల పరిధిలోని పాత మద్రాసు రోడ్డులోని పూసపాడు అడ్డరోడ్డు వంకాయలపాడు మధ్య ఉన్న కప్పలవాగు ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు నేలచప్టాపై నీరు పొంగి ప్రవహించింది. దీంతో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉన్న వంతెన శిధిలావస్థకు చేరడంతో నేలచప్టా నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సురేష్ అక్కడకు చేరుకొని ఎటువంటి ప్రమాదం జరగకుండా తమ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు.


పొంగి పొర్లుతున్న కప్పలవాగు


నీటితో నిండిన అనంతవరం చెరువు


:పోలూరు వాగు వద్ద స్తంభించిన రాకపోకలు





ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు, గుంటుపల్లి -ముక్తేశ్వరం చప్టాపై నిలిచిన నీరు, కొప్పెరపాడులో వరదనీటిలో స్కూలికి వెళుతున్న విద్యార్థులు, ఎస్సీ కాలనీలోనికి చేరిన నీరు

పోరాట యోధుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళులు


ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

చినగంజాం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చినగంజాంలో రేనాటి పాలెగాడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన సైన్యాధిపతి వడ్డే ఓబన్న వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షులు మున్నం వెంకటనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి 10 ఏళ్ల ముందే బ్రిటిష్ వారి పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన సైన్యాధుక్షుడిగా ఓబన్న పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనదన్నా రు. దేశానికి ఆయన సేవ లను పలువురు నాయకుల కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మేడికొండ సునీల్, కొల్లాటి ఏడుకొండలు, కొండూరి గోవిందు, మార్కా పురం వెంకటరామారావు, పాదర్తి ప్రకాష్, గుమ్మడి ఉమాశంకర్‌రెడ్డి, ఆసోది సూర్యనారాయణరెడ్డి, పఠాన్‌బాబు, షేక్ సైదా, సాయి, మహేష్ పాల్గొన్నారు.


వేటపాలెంలో మాట్లాడుతున్న వడ్డెరసంఘ నేతలు

వేటపాలెం(చీరాల) : స్వాతంత్ర్య సమర యోధులు వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలు వేటపాలెంలో ఘనంగా నిర్వహించారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెం అంజమ్మ, ఆ సంఘం పెద్దకాపు తన్నీరు బసవయ్య ముఖ్య అతిథులుగా ఏర్పాటు చేసిన సమా వేశంలో ఓబన్న పోరాట ప్రతిమ, త్యాగాలను వివరించారు. ప్రతి ఒక్కరూ అలనాటి పోరాటవీరుల ఆదర్శాలను ఆశయాలుగా అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని అన్నారు. అంతకు ముందు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల శ్రీను, రవి, పల్లపు శ్రీను, గంగరాజు, వెంకటేశ్వర్లు, మంగరాజు, రాజేశ్వరీ, లక్ష్మీ, వాణీ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు

చీరాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల వద్ద ఆశ్రయం పొందుతూ కుటుంబ సభ్యులకు దూరమైన వృద్ధుడిని పోలీసులు కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. బాషాఖాన్ అనుకోని రీతిలో కుటుంబానికి దూరం కాగా, 'ఆంధ్రజ్యోతి'లో ఆయన దీనావస్థపై కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీఎస్పీ ఎండీ మొయిన్ శక్తి టీం ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావుకు సూచనలు చేశారు. వారు పెదవడ్లమూడిలోని బంధువులకు సమాచారం అందించడంతో పాటు సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కుటుంబ సభ్యులకు వృద్ధుడిని అప్పగిస్తున్న పోలీసులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జె.పంగులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పంచాయితీ కార్యదర్శులు హాజరు కావలసిందిగా ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

గోతుల్లో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

- అవస్థలు పడి ప్రైవేట్ వాహనాలలో వెళ్లిన ప్రయాణికులు



రాజుపాలెం వద్ద గోతులలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

బల్లికురవ. అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కొణిదెన- మార్టూరు గ్రామాల మధ్య ఉన్న రోడ్డులో ఆర్టీసీ బస్సు సోమవారం రోడ్డుపై ఉన్న పెద్ద గోతులలో కురుకు పోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రోడ్డు బాగా దెబ్బతినడంతో పాటు వర్షం పడడంతో గోతులలో నీరు ఉండడంతో బస్సు దిగబడిందిని ప్రయాణికులు తెలిపారు. అద్దంకి నుంచి చిలకలూరిపేట వెళ్లి తిరిగి వస్తుండగా రాజుపాలెం గ్రామ సమీపంలో బస్సు నిలిచి పోవడంతో ప్రయాణికులు మార్గమధ్యలో ఉండి పోవాల్సి వచ్చింది. కొందరు ఆటోలను పిలిపించుకొని తమ గమ్యాలను తరలి వెళ్లారు.

ఉత్తమ సేవలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం



కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదగా ఉత్తమ సేవల పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):అద్దంకికి ఐదు స్వచ్ఛాంధ్ర అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ మున్సిపాలిటిగా జిల్లా స్థాయి లో అద్దంకి మున్సిపాలిటి ఎంపికైంది. వివిధ విభాగాల్లో మున్సిపాలిటీకి మూడు అవార్డులు దక్కాయి. సోమవారం బాపట్ల లో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర అవార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావుల నుంచి అందుకున్నారు. అదేవిధంగా అద్దంకి వ్యవసాయమార్కెట్ కమిటీ కూడా ఎంపిక కావడంతో ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి అందుకున్నారు. ప్రకాశం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలకు అవార్డు దక్కింది.

మార్టూరు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):మార్టూరులోని అవనీర్ గ్రానైట్‌కు స్వచ్ఛాంధ్ర అవార్డు దక్కింది. ఈ మేరకు సోమవారం రాత్రి బాపట్లలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్ చేతులమీదగా గ్రానైట్ పరిశ్రమ యజమాని చెరుకూరి అంజిబాబు, మాజీ గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంటూరి ఆంజనేయులు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. వాతావరణ కాలుష్యానికి దూరంగా, పర్యావరణ సమస్యలు లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా గ్రానైట్ పరిశ్రమలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మిగిలిన గ్రానైట్ పరిశ్రమల యజమానులు కూడా అవార్డు పొందిన గ్రానైట్ పరిశ్రమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, తాటి నాగేశ్వరరావు, కొర్రపాటి వేణు, ఎన్ శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితర గ్రానైట్ పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

పర్చూరు :పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (సీహెచ్‌సీ) జిల్లా స్థాయి స్వచ్ఛతా అవార్డుకు ఎంపికయ్యింది. సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా వైద్యశాల సూపరిండెంట్ సౌమ్య అవార్డును అందుకున్నారు. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పర్చూరు వైద్యశాలకు లభించింది.

గ్రీన్ అంబాసిడర్ పోలయ్యకు జిల్లా అవార్డు

పంగులూరు : మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీకి చెందిన గ్రీన్ అంబాసిడర్ వేటగిరి పోలయ్యకు జిల్లా అవార్డు లభించింది. వేటగిరి పోలయ్య సేవలను గుర్తించిన అధికారులు జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికచేశారు. అవార్డుకు ఎంపికైన పోలయ్యను ఎంపీడీవో కే.స్వరూపారాణి, డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్, పంచాయతీ కార్యదర్శి శిరీష, మండలంలోని పంచాయితీ కార్యదర్శులు అభినందించారు.







అవార్డు అందుకుంటున్న పారిశ్రామిక వేత్తలు అంజిబాబు, ఆంజనేయులు, పర్చూరు వైద్యురాలు డాక్టర్ సౌమ్య, అద్దంకి ఏఎంసీ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డి

సోమశిలకు 12,992 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి సోమవారం ఎగువ ప్రాంతాల నుంచి 12,992 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 73.024 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,600, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

'ఉపాధి'లో అవినీతిపై పునర్విచారణకు ఆదేశాలు 8





సేవలకు సత్కారం !

- ఎన్ఎస్ఎస్ వలంటీరు పృథ్వీరాజ్‌కు రాష్ట్రపతి అవార్డు ప్రదానం



వెంకటాచలం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ద్వారా సామాజిక సేవాకార్యక్రమాల్లో విశిష్ట కృషిచేసిన ముమ్ముల పృథ్వీరాజ్‌కు సోమవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డును ప్రదానం చేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పృథ్వీరాజ్ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. ఎన్ఎస్ఎస్ ద్వారా ఆయన మూడేళ్లపాటు రక్తదానం, మొక్కలు నాటడం, పచ్చదనం - పరిశుభ్రత, మహిళా సాధికారత, జాతీయ సమైక్యతా శిబిరం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణం పరిరక్షణ వంటి సామాజిక సేవకార్యక్రమాల్లో పాల్గొని పలువురి ప్రశంసలందుకున్నారు. ఈ సేవలకుగాను పృథ్వీరాజ్ జాతీయ ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీరు అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్‌ను వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఉదయ్ శంకర్ తదితరులు అభినందనలు తెలిపారు. కాగా పృథ్వీరాజ్ అనంతపురం జిల్లా సెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందినవారు.

వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న ఉదయగిరి పంచాయతీ బస్టాండ్

హమ్మయ్య.. వాన కురిసింది!

- మెట్టను పలకరించిన వరుణుడు

వాన కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న మెట్టవాసులను వరుణుడు కరుణించాడు. సోమవారం ఉదయగిరి ప్రాంతంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వేసవిని తలపించేలా భానుడు భగ్గుమంటుండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. అయిదే, సోమవారం ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి, చలిగాలులు వీచాయి. వర్షపు నీటితో పట్టణంలోని మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రహదారులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. పంచాయతీ బస్టాండ్ సెంటర్ చెరువును తలపించింది. ఈ వర్షం ఆరుతడి, ఉద్యాన పంటలకు ఎంతమేలు చేకూర్చింది.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



పాతబిట్రగుంటలో రామచంద్రయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రభాకర్

పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతుల మృతి

బిట్రగుంట/కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాతబిట్రగుంట, కందుకూరులలో సోమవారం పిడుగుపాటుకు గురై ఇద్దరు రైతులు మృతి చెందారు. విడవలూరు మండలానికి చెందిన రామచంద్రయ్య నాలుగేళ్ల క్రితం బోగోలు పాతబిట్రగుంటలో కాపురం ఉంటున్నాడు. పశువులు మేపడం, కూలిపనులు చేస్తూ భార్య నాగమణి, ఇద్దరు ఆడపిల్లల్ని పోషిస్తున్నాడు. ఆదివారం మధ్నాహ్నం పశువులను తోలుకుని వెళ్లి తిరిగా రాలేదు. బంధువులు ఎంతగాలించినా ఆచూకీ తెలియరాలేదు. సోమవారం ఉదయం గ్రామ శివార్లలో రామచంద్రయ్య (40) మృతి చెంది ఉన్నట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోగోలు ఎస్సై ఎస్.ప్రభాకర్, ఏఎస్సై కోటేశ్వరరావు, వీఆర్వో చందు, తలారి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల, వీపు వెనుక భాగంలో కాలినట్లు గుర్తించారు. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పిడుగులు పడినట్లు తెలియడంతో పిడుగుపాటుకు గురై రామచంద్రయ్య మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రయ్య మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

- కందుకూరు మండలం మాచవరం ఎస్టీ కాలనీకి చెందిన తలపల రామ్మూర్తి(60) అనే గొర్రెలకాపరి పిడుగుపాటుకు గురై సోమవారం మృతి చెందాడు. మాచవరం కొండ సమీపంలో రామ్మూర్తి గొర్రెలను మేపుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. దీంతో రామ్మూర్తి కొండ సమీపంలో చెట్ల కిందకు వెళ్లాడు. ఇదే సమయంలో పిడుగుపడటంతో రామ్మూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు.



- ప్రాణాలు తీస్తున్న 'కోల్డ్‌రిఫ్'
- ఔషధ నియంత్రణ శాఖ తనిఖీలు
- జిల్లాలో సరఫరా లేదని నిర్ధారణ
- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

దగ్గు మందు.. నిషేధం!

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో చిన్నారుల మృతికి కారణమైన దగ్గుమందుపై కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమయింది. వెంటనే ఆయా రాష్ట్రాల్లో దగ్గుమందుపై నిషేధం విధించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో కోల్డ్‌రిఫ్ అనే దగ్గు మందు సరఫరా ఎలా ఉంది? అమ్మకాలు చేస్తున్నారా? తదితర విషయాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరా తీశారు. కాగా జిల్లాలోనూ ఔషధ నియంత్రణ శాఖాధికారులు 2500లకుపైగా ఉన్న మందుల దుకాణాలను తనిఖీ చేసి, కోల్డ్‌రిఫ్ సరఫరా లేదని నిర్ధారించారు. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

- తప్పిన ప్రమాదం

అనారోగ్యానికి గురైన పిల్లల తల్లిదండ్రులకు కోల్డ్‌రీఫ్ దగ్గు మందు అందుబాటులో లేకపోవటం, వైద్యులు కూడా ఆ మందును సిపార్సు చేయకపోవటంతో ప్రమాదం లేదని తెలుస్తోంది. చిన్న ఫార్మా కంపెనీ తయారు చేసిన ఈ కోల్డ్‌రిఫ్ మందులో విషపదార్థాల కారణంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 14 మంది చిన్నారుల చనిపోయారు. తమిళనాడులోని కాంచీపురంలో కోల్డ్‌రిఫ్ తయారు చేసే ఫార్మా కంపెనీ ఉంది. ఈ మందును ల్యాబ్‌లో పరీక్షించగా డైథైలిన్ గ్లైకాల్, ఇథైలిన్ గ్లైకాల్ వంటి ప్రమాకర రసాయనాలు ఉన్నట్లు గుర్తించి, కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఉన్న ఫార్మా కంపెనీల నుంచి జిల్లాలో అనేక ఔషదాలు చలామణి అవుతున్నాయి. ఈ నేపధ్యంలో కోల్డ్‌రిఫ్ దగ్గుమందు మాత్రం ఇంకా ఇక్కడికి రాలేదు.

సరఫరా లేదు



చిన్నపిల్లల ప్రాణాలు తీసిన కోల్డ్‌రిఫ్ దగ్గు మందుపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆ దగ్గుమందుపై జిల్లాలో తనిఖీ చేశాం. అయితే ఎక్కడా సరఫరా లేదని తెలిసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో 14 మంది చిన్నారులు ఈ దగ్గుమందు వల్ల మృత్యువాత పడటం ఆందోళన కలిగించే విషయం. ఇలాంటివి జిల్లాలో జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

- రమేష్‌రెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ

అమ్మకాలు లేవు!



జిల్లాలో కోల్డ్‌రిఫ్ దగ్గుమందు ఎక్కడైనా చలామణి అవుతుందా... అంటూ మేము కూడా ఆరా తీశాం. అయితే ఈ మందు సరఫరా లేదని తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకాలు చేయవద్దని అన్ని ఔషధ దుకాణదారులను హెచ్చరించాం. ఎక్కడా కోల్డ్‌రిఫ్ దగ్గుమందు అమ్మకాలు జరగడం లేదు.

- పేరూరి ప్రదీప్, జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు





సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న స్వచ్ఛ వారీయర్ పద్మావతి, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్

'స్వచ్ఛ' అవార్డుల ప్రదానం

ఆత్మకూరు/నెల్లూరురూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద పరిశుభ్రత రంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను ఆత్మకూరు మున్సిపాలిటీకి, నెల్లూరులోని పారిశుధ్య కార్మికురాలు తాటిపర్తి పద్మావతికి స్వచ్ఛవారీయర్ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అందజేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగాప్రసాద్‌లు ఈ అవార్డును అందుకున్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో రూ.లక్షలు దోచేశారు!



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పార్ట్‌టైమ్ జాబు. రూ.లక్షల్లో జీతం అంటూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో ప్రగల్భాలు పలికారు. వారి మాటలు నమ్మిన ఓ యువతి రూ.7.20 లక్షలు వారికి సమర్పించింది. తీరా ఉద్యోగం రాకపోవడంతో తాను పోయానని నమ్మి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పెద్ద బజారు ప్రాంతానికి చెందిన సయ్యద్ యాఫియాకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆగష్టు 31వ తేదీన పార్ట్‌టైమ్ జాబ్ వర్క్‌ఫర్మ్ హోమ్ అని పోస్టు వచ్చింది. దీంతో - మిగతా 7లో..

మనుబోలు మండలం మడమనూరు గ్రామసంస్థకు చెందిన మహిళకు అవార్డు అందచేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, నుడా చైర్మన్ కోటంరెడ్డి, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు



ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర విజయవంతం

- స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతమవుతోందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజన్-2047లో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సీఎం చంద్రబాబునాయుడు పది సూత్రాల కార్యక్రమాన్ని నిర్దేశించారని తెలిపారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రజలంతా భాగస్వాములైతేనే పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయని వివరించారు. గ్రామస్థాయి నుంచి వివిధ వర్గాల వారికి స్వచ్ఛత అవార్డులు ప్రకటించటం సంతోషదాయకమని, వారి స్ఫూర్తితో మిగతావారు స్వచ్ఛత కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కృషితోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మన ఊరిని, మన ప్రాంతాన్ని ప్రేమించినప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే అభిప్రాయం కలుగుతుందని చెప్పారు.

- పలువురికి అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పరిధిలోని కావలి మండలం చెంచుగానిపాళెం విలేజ్ ఆర్గనైజర్(వీవో)కి, మనుబోలు మండలంలోని మడమనూరు వీవోకి, ఇందుకూరుపేట మండలం లేబూరు బిట్-2 వీవోకి, నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లి వీవోకి, వెంకటాచలం మండలం పూడిపర్తి వీవోకి డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సమక్షంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా, జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ అవార్డులు అందచేశారు. అలాగా మెప్మా పరిధిలో ఆత్మకూరు మున్సిపాలిటీ టెంకాయతోపు స్లమ్ లెవల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్)కు, బుచ్చిలోని బుచ్చి-4 ఎస్ఎల్ఎఫ్‌కు, కందుకూరు మున్సిపాలిటీలోని ఇందిరాగాంధీ ఎస్ఎల్ఎఫ్‌కు స్వచ్ఛతా అవార్డులు వచ్చాయి. వీటిని మెప్మా పీడీ లీలారాణి సమక్షంలో సమాఖ్యల పదాధికారులు అందుకున్నారు.

తమిళ జాలర్ల అక్రమ చేపలవేటే కారణం

ఫిషింగ్ హార్బర్‌కు మరో 2 తమిళ బోట్లు

బిట్రగుంట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు సోమవారం తమిళనాడుకి చెందిన మరో రెండు మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారులు చేర్చారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు, కారైకల్ ప్రాంతాలకు చెందిన మత్స్యకారుల అక్రమంగా సముద్ర చేపటవేటను సాగిస్తుండగా ఆంధ్రరాష్ట్ర గంగపుత్రులు అడ్డుకుంటున్నారు. తమిళనాడుకి చెందిన బోట్లను అడ్డుకునేందుకు ఏపీలోని 160 తీరప్రాంతగ్రామాల మత్స్యకారుల సమావేశానంతరం ఏకాభిప్రాయానికి వచ్చారు. అందులో భాగంగా మేలో ఓ బోటును అదుపులోకి తీసుకున్నారు. సెప్టెంబరులో మరో బోటు రాగా, దాన్ని కూడా అడ్డుకున్నారు. కాగా శనివారం రామాయపట్నం హార్బర్ సమీపాన చెన్నారాయునిపాలెం తీరంలో అక్రమ చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను గుర్తించిన స్థానిక గంగపుత్రులు అడ్డుకున్నారు. చేపల వేట చేస్తున్న నాలుగు తమిళనాడు బోట్లలో రెండు పారిపోగా, మరో రెండు బోట్లను అడ్డుకుని రామాయపట్నం హార్బర్‌లో ఉంచి సోమవారం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు చేర్చారు. అయితే రెండు బోట్లలో ఉన్న 24 మంది తమిళ జాలర్లను అధికారులు సురక్షితంగా రైళ్లలో వారి ఊళ్లకు పంపించినట్లు స్థానిక మత్స్యశాఖ అధికారులు తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు జిల్లా మత్స్యశాఖ జేడీ శాంతి, కావలి రూరల్ సీఐ, స్థానిక ఎస్సై, సిబ్బంది చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కాగా ఆంధ్రాలో అక్రమ చేపలవేట ఆపేంత వరకు తమిళ బోట్లను అడ్డుకుంటానే ఉంటామని రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు తెగేసి చెబుతున్నారు.



జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న కడలూరు మెకనైజ్డ్ బోట్లు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు - వివరాలు 8లో..

బ్రాహ్మణక్రాక పంచాయతీ విభజనపై గ్రామసభ

ప్రభుత్వం మారినా వైసీపీ నేతల బుద్ధి మాత్రం మారడంలేదు. ఓ చారిటబుల్ ట్రస్టు పేరుతో 565 జాతీయ రహదారి పక్కనే ఉన్న విలువైన స్థలంలో రాత్రి రాత్రే రేకులషెడ్ నిర్మించి విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు వెళ్లడంతో మేల్కొన్న రెవెన్యూ అధికారులు పరుగులు తీసి రేకులషెడ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన సంఘటన దుత్తలూరు మండలం నందిపాడులో చోటుచేసుకొంది.



వాగు పోరంబోకు స్థలంలో ఏర్పాటు చేసిన రేకులషెడ్

వైసీపీ నేత భూ దాహం!

- వాగు పోరంబోకు భూమి ఆక్రమణ?
- రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మాణం
- ట్రస్ట్ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు
- ఫిర్యాదులతో మేల్కొన్న రెవెన్యూ యంత్రాంగం
- షెడ్డు తొలగించి, ఫ్లెక్సీ ఏర్పాటు
- కఠిన చర్యలు తీసుకుంటాం : తహసీల్దారు

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నందిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 226.2లో 1.71 ఎకరాల వాగు పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి ఏర్పేడు-నకిరేకల్ జాతీయ రహదారి (నెం.565)కి పక్కనే ఉండటంతో మంచి ధర పలుకుతోంది. విలువైన భూమి కావడంతో అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత కన్నుపడింది. ఇంకేముంది.. రహదారి పక్కనే ఉన్న సుమారు ఏడు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఏకంగా రాత్రిరాత్రే రేకుల షెడ్ నిర్మాంచాడు. ప్రస్తుతం ఇక్కడ సెంటు ధర రూ.5-6 లక్షల వరకు పలుకుతోంది. ఆ లెక్కన బహిరంగ మార్కెట్‌లో అక్రమించిన స్థలం సుమారు రూ.40 లక్షల వరకు ఉంటోంది. అయితే, ఈ ఆక్రమణ వ్యవహారం ఆ నోట.. ఈ నోట పడడంతో రెండు రోజుల తరువాత ఓ ట్రస్టు పేరుతో అనాథలకు ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. ప్రధాన రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేదు. స్థలం ఆక్రమణపై ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు వెళ్లడంతో అప్పుడు రెవెన్యూ అధికారులు కళ్లు తెరిచారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని వైసీపీ నేత నిర్మించిన రేకులషెడ్‌ను తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ వ్యవహారంపై తహసీల్దారు నాగరాజు మాట్లాడుతూ ఆక్రమిత స్థలంలో రేకులషెడ్ తొలగించి అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	135
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 525

విశ్రాంత ఉపాధ్యాయులకు ఘన సన్మానం

అల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు రామయ్య, పెనుమూడి వెంకటేశ్వర్లును ప్రిన్సిపాల్ వీ.శ్రీనివాసులు, కళాశాల సిబ్బంది సోమవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలకు సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించుకోవడం వారి సేవలకు గౌరవం దక్కినట్లే అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధరరావు, చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం, చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మండల ఏఈ షేక్ ఫిరోజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో ఆర్డీఎస్ఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల పింఛను ఇప్పించండి సారూ..

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డుకు చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన దివ్యాంగుడు చెవుడు మాలకొండయ్య తాను తన భార్య ఇద్దరం పక్షవాతంతో నడవలేని పరిస్థితులలో ఇంటికే పరిమితమయ్యామని, మాకు దివ్యాంగుల పించన్ ఇప్పించాలని కోరారు. పీజీఆర్ఎస్ సందర్భంగా సోమవారం ఆయన కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. ప్రస్తుతం తనకు వృద్ధాప్య పింఛన్ వస్తోందని, సదరన్‌లో తీసుకున్న దివ్యాంగుల సర్టిఫికెట్ ఉన్నా దివ్యాంగుల పింఛన్‌కు సచివాలయంలో తమ పేరు నమోదు చేయడం లేదన్నారు. అలాగే తన భార్యకు సదరన్ సర్టిఫికెట్ తీసుకునేందుకు సచివాలయానికి వెళ్లితే అక్కడ ఆమె పేరు నమోదు చేసి సదరన్‌కు పంపడం లేదన్నారు. నిరుపేదలైన మాకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అలాగే దగదర్తి మండలంకు చెందిన శెట్టిపల్లి రామయ్య తమ భూమిని కుటుంబ సభ్యులు కాజేశారని, తమకు న్యాయం చేసి తమ భూమి తనకు ఇప్పించాలని కోరారు. వీరి వెంట టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఉన్నారు.

ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలోనే పని చేస్తాం

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నాయకత్వంలోనే మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులం పని చేస్తామని విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులు స్పష్టం చేశారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో విష్ణు అనుచరులైన వైసీపీ నాయకులు అనంత బాలకృష్ణంరాజు, గోసల గోపాలరెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డిలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు ఇద్దరూ ఒకటేనన్నారు. ప్రతాప్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించినప్పుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫోన్‌చేసి ఆయనతో మాట్లాడి విచారించారన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డితో మాట్లాడిన తర్వాతనే విష్ణువర్ధన్‌రెడ్డిని కేంద్ర కమిటీలో సభ్యుడిగా నియమించారన్నారు.

పోట్లూరు శ్రీనివాసులుకు ఘన సన్మానం

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు జన్మదినం పురస్కరించుకుని సోమవారం ఆయన కార్యాలయంలో పలువురు న్యాయవాదులు, సిబ్బంది ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు పీవీ రాఘవరావు, వై.లూకస్‌జోసఫ్, వై.కోమలి, ఏ.హరిబాబు, పీ.ఝాన్సీ, సిబ్బంది పీ.విజయ్‌కుమార్, బీ.ప్రసాద్. పీ.రామకృష్ణరాజు, వింజమూరు నరేష్, ఎస్కే.ఆరీఫ్ టీడీపీ నాయకులు, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

బిట్రగుంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ, చిన్నపిల్లలకు కొత్తగా ఆధార్ నమోదుకు అవకాశం ఉందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం రెడ్‌క్రాస్‌లో రక్తదానం

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నాగరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థంగా అతని స్నేహితులు సోమవారం కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో రక్తదానం చేశారు. వారిని రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే.హరినారపరెడ్డి అభినందించారు. జీ.సాయి గౌతమ్, బాలాజీలను రెడ్‌క్రాస్ నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టనూ తవ్వేశారు!

- యథేచ్ఛగా గ్రావెల్ దందా
- అక్రమంగా ప్లాట్లకు తరలింపు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



గ్రావెల్ కోసం తవ్వేసిన రాజుపాలెం పెద్దచెరువు కట్ట

ఉలవపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అక్రమ గ్రావెల్ దందా ముఠా చెరువు కట్టలను వదలడం లేదు. వర్షాలు సంవృద్ధిగా కురిసి చెరువు నిండితే పరిస్థితి ఏమిటన్న విషయాన్ని విస్మరించి తమ పని జరిగిపోతే చాలన్నట్లు మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువు కట్టను రాత్రి సమయాల్లో యంత్రాలతో తవ్వి టిప్పర్లతో అక్రమంగా చెరువుకు దక్షిణం వైపు అటవీ రోడ్డు మార్గానా తరలించారు. ఇక్కడ తవ్విన సుమారు 150 ట్రిప్పుల గ్రావెల్‌ను చాగొల్లు హైవే పక్కన ఉన్న స్థలం మేరువకు తోలినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు గుంతల్లో నీరు నిలిచింది. దీంతో చెరువు కట్ట అంచున గ్రావెల్ తీసేందుకు అనుకువగా ఉండటంతో కొంత దూరం మేరకు కట్టనూ తవ్వేశారు. కాగా ఈ గ్రావెల్ దందాలో అధికార పార్టీ నాయకుల పాత్ర ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయితే ఐదారు నెలల క్రితం గ్రావెల్ దందాపై ఆరోపణలు రావడంతో పార్టీకి చెడ్డపేరు తేవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే సదరు వ్యక్తులను ఘాటుగా హెచ్చరించారు. ఆదమరిచిన ఆ నేతలు మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా రాత్రుల్లో గ్రావెల్ దందా మొదలు పెట్టినట్లు సమాచారం. అక్రమార్కులు గ్రావెల్ కోసం చెరువును గుళ్ల చేస్తున్నా మాకేం పట్టలేదన్నట్లు ఇరిగేషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. స్థానికులు కొందరు చెరువు కట్టను ధ్వంసం చేస్తున్నారని ఇరిగేషన్ అధికారులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించినా, మూడు రోజులుగా అర్ధరాత్రులు గ్రావెల్ తోలుతున్నా పట్టించుకోని ఇరిగేషన్ అధికారుల తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు.



చాగొల్లు హైవే పక్కన పొలం మేరువకు అక్రమంగా తోలిన గ్రావెల్

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయం

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై అత్యున్నత న్యాయస్థానంలోనే సనాతన ధర్మం ముసుగులో కొందరు కుల, మత మౌఢ్య ముఠా న్యాయవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అఖిల భారత మాలసంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. న్యాయవాదులు జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు నిలబడి న్యాయస్థానం పవిత్రతను మంటగలిపేలా అసభ్యంగా ప్రవర్తిస్తూ నినాదాలు చేయడం, ఒక న్యాయవాది ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం చూస్తుంటే భారత రాజ్యాంగానికే పెనుముప్పు పొంచి ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ పెద్దల ప్రోద్భలం లేకుండా న్యాయవాదులు ఇంతటి దుస్సాహసానికి పూనుకోలేరని, ప్రధాన న్యాయమూర్తి దళితుడు కావటం, అన్నిమతాలను గౌరవించే సెక్యులర్‌గా ఉంటానని ఆయన ప్రకటించటమే ఈ దాడికి కారణమని పేర్కొన్నారు. ఆ న్యాయవాదుల ముఠాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయం



డీటీ జూలియాభాయ్‌కి కూరగాయలు విక్రయిస్తున్న పొదుపు మహిళలు

జలదంకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో వ్యవసాయశాఖ-రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో పొదుపు మహిళలు సోమవారం సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. పొదుపు మహిళలు సేంద్రియ ఎరువులతో సాగుచేసి పండించిన పలురకాల కూరగాయలు ఉంచి తహసీల్దారు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరైన ప్రజలకు విక్రయించారు. రసాయనాలు వాడని కూరగాయలు వల్ల ప్రజలకు ఆరోగ్యపరంగా కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ జూలియాభాయ్ సేంద్రియ ఉత్పత్తులను పొదుపు మహిళల వద్ద కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించారు.

రూ.10 లక్షలతో శ్మశానం అభివృద్ధి



ఎక్స్‌కవేటర్‌తో శ్మశానాన్ని శుభ్రం చేయిస్తున్న దాతలు

అల్లూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌కాలం నాటి క్రైస్తవ సామాజిక వర్గ శ్మశానవాటికను రూ.10లక్షల సొంత నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు యేసు అభిషేక మినిస్ట్రీష్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవరకొండ సామియేల్‌బాబు అన్నారు. సోమవారం ఎక్స్‌కవేటర్‌తో శ్మశాన వాటికలో కంపచెట్లను తొలగింప చేయించారు. ప్రహరీగోడ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. శ్రమదానం చేసినవారికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవసంఘ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సుధీర్‌బాబు, టీడీపీ నాయకులు

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పీటర్‌పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డీ.సుధీర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేయడంతోపాటు అన్నదానం చేసి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుధీర్‌బాబు కుమారుడు ప్రీతమ్‌పాల్, మేనల్లుడు రాహుల్‌పాల్‌ల జన్మదినాన్ని పురస్కరించుకుని వెంగళరావునగర్‌లోని ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫౌండేషన్ కోఆర్డినేటర్ అడ్వకేట్ శివప్రసాదరెడ్డి,దావీద్, టీడీపీ నాయకులు శానం హరి, కృష్ణ, ఏగూరి చంద్రశేఖర్, జగన్, మాజీ కౌన్సిలర్ ఎస్డీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షలు దోచేశారు!

(5వ పేజీ తరువాయి)

దానిని క్లిక్ చేసిన వెంటనే ఆమెకు వాట్సాప్‌నకు పార్ట్‌టైమ్ జాబ్‌లు అందుబాటులో ఉన్నాయని మెసేజ్‌లు వచ్చాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు కొన్ని టాస్కులు ఇవ్వడంతోపాటు నగదు చెల్లించాలని సూచించారు. వారి మాటలు నమ్మిన యాఫియా పలు దఫాలుగా రూ.7.20 లక్షలు చెల్లించింది. అయితే, ఉద్యోగం రాకపోవడంతో పలుమార్లు సదరు కంపెనీని సంప్రదించేందుకు ప్రయత్నించినా కుదరలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కావలి మున్సిపాలిటీకి స్వచ్ఛ అవార్డు



వలేటివారిపాలెం : కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్, కావలి : కలెక్టర్, కావలి ఎమ్మెల్యేల నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర అవార్డ్స్ 2025లో కావలి మున్సిపాల్టీ స్వచ్ఛ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మల చేతుల మీదుగా కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ అందుకున్నారు. అలాగే కావలి పురపాలక స్వచ్ఛవారియర్స్ (పారిశుధ్య కార్మికులు)గా గుంజి అంకయ్య, మర్లపాటి భూపతి అవార్డులు పొందారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సురేష్‌రెడ్డి, కావలిపురపాలకసంఘం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సోమవారం నెల్లూరులో ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేసారు. అనంతరం కావలి నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చుండి మోడల్ స్కూల్‌కు..

వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌కు జిల్లాస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. ఈ సందర్భంగా నెల్లూరులో సోమవారం చుండి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్‌కు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం

కావలి రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాళెంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన పాంచరాత్రిగం పండితులు చంగోళం నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పవన్‌స్వామి మహా సంప్రోక్షణ, మహాకుంభాభిషేక మహోత్సవ పూజలు జరిపించారు. ఉదయం 7 గంటల నుంచి శ్రీరామ మూలమంత్ర హోమం, సకల గాయత్రి హోమం, కుంభ ఆరాధన, కుంభ ఉద్వాసన, సంప్రోక్షణ, కుంభాభిషేకము, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11.30 గంటలకు మేళతాళాల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం కిక్కిరిసింది. భక్తులు గోవిందనామ స్మరణలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తుల వేషధారణలో చిన్నారుల నృత్యప్రదర్శ అలరించింది.



మంగళసూత్రాలు చూపుతున్న ఆలయ అర్చకుడు పవన్ స్వామి

సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఏరీ?

- ఆరు చోట్ల పోస్టులు ఖాళీ
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సగం సచివాలయాల్లో ముఖ్యమైన డిజిటల్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగులను బదిలీ చేసింది. ఇందులో భాగంగా మండలంలోని 13 సచివాలయాల్లోని 6 సచివాలయాలకు చెందిన 6 మంది డిజిటల్ అసిస్టెంట్లను బదిలీ చేసింది. మండలంలోని పెదపవని-1, 2, పెంట్రాల, లింగసముద్రం-1, యర్రారెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం సచివాలయాలకు చెందిన డిజిటల్ అసిస్టెంట్లను ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో ఎవరినీ నియమించలేదు. దీంతో అప్పటి నుంచి ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సచివాలయాల్లో ఏపీ సేవా పోర్టల్‌లోని 536 సేవల్లో మండలంలో కనీసం 40 నుంచి 50 రకాల సేవలను అందిస్తారు. ఇందులో రెవెన్యూ సర్వీసులకు చెందిన పనులన్నీ డిజిటల్ అసిస్టెంట్లు చేస్తారు. ముఖ్యంగా మ్యుటేషన్లు, 1బీ, అడంగల్, పట్టాదారు, ఆధార్ సీడింగ్, కుల, ఆదాయ, జనన. మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన తదితర పనులను చేస్తుంటారు. వీటితో పాటు పలు రకాల సేవలను ప్రజలకు అందిస్తుంటారు. అయితే ఆయా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంటు లేకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు. దీంతో ప్రజలు వ్యయప్రయాసలకోర్చి ఇతర సచివాలయాలకు వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లింగసముద్రం-1 సచివాలయ డీఏ బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఆధార్ సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి కొత్త డీఏలను నియమించి ప్రజల కష్టాలు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లు



ఉప్పలపాడు - కొండసముద్రం రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

వలేటివారిపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పలపాడు నుంచి కొండసముద్రంనకు వెళ్లే రహదారికి రెండు వైపులా ముళ్లచెట్లు పెరిగిపోయాయి. ఏపుగా పెరిగిన ముళ్లచెట్లతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయాల్లో వాహనాలు రోడ్డు మార్జిన్ దిగి ముళ్ల చెట్లు తగిలి వాహనదారులకు రక్తగాయాలై ప్రమాదాల బారిన పడుతున్నారు. కొండసముద్రం నుంచి ఉప్పలపాడు మీదుగా నిత్యం ఏదో ఒక పని మీద వాహనదారులు వలేటివారిపాలెం వస్తూనే ఉంటారు. రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును కమ్మేసిన ముళ్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

భ్రూణ హత్యలు నివారించాలి

- ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ



భ్రూణ హత్యల నివారణపై అవగాహనకు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తదితరులు

కావలి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడ, మగ శిశువుల మధ్య వివక్షతను విడనాడి భ్రూణ హత్యలు నివారించాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ తెలిపారు. లింగనిర్ధారణ నిషేధిత చట్టం కావలి డివిజన్ సలహా కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం స్థానిక ఆర్డీవో చాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ భ్రూణ హత్యల నివారణపై ప్రజలలో అవగాహన కల్పించాలని, ముందుగానే లింగనిర్ధారణ చేయడం నేరమని, అలా చేసిన వారిపై చర్యలు తప్పవని చెప్పాలన్నారు. భేటీ బచావో భేటీపడావో.. ఆడపిల్లలను చదివిద్దాం రక్షిద్దాం.. దీని కొరకు సమాజంలో అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, సీడీపీవో సౌజన్య, రెండవ పట్టణ ఎస్ఐ బాషా, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం



చంద్రబాబునాయుడు, లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న ఆటో డ్రైవరు

కావలి(టౌన్), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్ట సచివాలయం వద్ద సోమవారం ఆటో డ్రైవర్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15వేల చొప్పున జమ చేయడం హర్షదాయకమన్నారు. అందుకు కృతజ్ఞతగా వారి చిత్రపటాలకు పాలభిషేకం చేశామన్నారు. ఏ ఒక్కరిని విస్మరించకుండా ఆటో డ్రైవర్లందరీ ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి కృషి చేసినందుకు, ఆటోలు సజావుగా నడిచేందుకు రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరివీధి ప్రసాద్, పెంచలయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 సేవింగ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సూపర్‌సేవింగ్స్‌పై స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎస్టీ శ్లాబులలో వచ్చిన మార్పులు తద్వారా ప్రజలకు చేకూరే ప్రయోజనాలను వివరించటంతో పాటు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ డిపార్టుమెంటు ఇన్‌చార్జి డాక్టరు సీహెచ్ శ్రీనివాసరావు, వార్డు 2 నోడల్ ఆఫీసర్ కొండమ్మ, సచివాలయం అడ్మిన్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలోను కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలి ఆధ్వర్యంలో జీఎస్టీ శ్లాబులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం



కందుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు, డిపో అధికారులు

కందుకూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. సవిత సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ ఏవీ రమేష్ తన తండ్రి అన్నంగి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఈ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. రమేష్ మామ ఉమ్మడిశెట్టి సుబ్బారావు చేతులమీదుగా డిపో అధికారులు ఆ ప్లాంట్‌ను ప్రారంభింపజేశారు. డిపో మేనేజరు రాపూరి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం దాత ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు శ్యాంప్రసాద్, హనుమంతరావు, పద్మారావు, కే.రమేష్‌బాబు, మహేష్‌బాబు, సుబ్బారావు, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టు కూలీ వితరణ



విద్యార్థులకు యూనిఫాం అందజేసిన ఉపాధ్యాయులు, గ్రామస్థులు

కావలి రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం కుట్టు కూలీ కోసం గ్రామానికి చెందిన వ్యాపారవేత్తలు చెన్నా రామాంజనేయులు, కొండలరావులులు సోమవారం రూ.12 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శానం కృష్ణ, బూచి మధుసూదన్‌రావు, వెంకయ్య, నాగూర్, నగేష్ ధనుష్, గ్రామానికి చెందిన సుధాకర్, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న నిర్లక్ష్యం



అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూర్పుబోయమడగలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వరికుంటపాడుకు వెళ్లే లింకు రోడ్డు ప్రాంతంలోని సింగిల్, త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో విద్యుత్ స్తంభాలకు ఏపుగా పెరిగిన కంపచెట్లు అల్లుకుపోయాయి. దీంతో గాలి వీచినా, వర్షాలు కురిసిన సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. కనీసం అటువైపు వెళ్లే పరిస్థితి కూడా లేకపోవడంతో మరమ్మతులు చేసేందుకు కూడా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-వరికుంటపాడు (ఉదయగిరి రూరల్,ఆంధ్రజ్యోతి)

ఇలాగైతే ప్రమాదాలు జరగవా!?

● రహదారి పక్కనే విద్యుత్ స్తంభాలు ● ప్రమాదాల బారిన వాహనదారులు



గ్రామాల్లో నిరంతరంగా త్రిఫేజ్ విద్యుత్ సరఫరాను కొనసాగించాలనే తలంపుతో విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసి మిగిలిన వాటిని రహదారి పక్కనే వదిలేయడంతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి మండలం గండిపాళెం, గంగిరెడ్డిపల్లి, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల సమీపంలో రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని, పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి వేళల్లో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

-ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

సచివాలయ పనులు సాగేదెన్నడో..?



అసంపూర్తిగా నిలిచిన సచివాలయ పనులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన సచివాలయ భవనాల పనులు నత్తతో పోటీ పడుతూనే ఉన్నాయి. మండలంలోని విరువూరులో చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి ఏళ్ల తరబడి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఆ భవనానికిరూ. 40లక్షల నిధులు మంజూరవడంతో అప్పట్లో పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేపట్టారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పనులు నిలిచిపోయినట్లు సమాచారం. దీంతో మిగిలిన సగభాగం పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. అధికారులు సైతం మనకెందులే అంటూ పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం ఆ భవనం యాచకులు, మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు సాగేలా చూడాలి.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) అండర్-19కు సంబంధించి పలు క్రీడల్లో క్రీడాకారుల ఎంపికలకు షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా కార్యదర్శి పాటూరు వేణుగోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలు మంగళవారం నుంచి జరుగుతాయని తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం ఉదయం 9 గంటలకు అథ్లెటిక్స్, బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఖోఖో, 9వతేదీ ఉదయం 9 గంటలకు బేస్‌బాల్, మధ్యాహ్నం 3 గంటలకు కబడ్డీ, 10వతేదీ ఉదయం 9 గంటలకు సాఫ్ట్ బాల్, మధ్యాహ్నం 3 గంటలకు వాలీబాల్, హాకీ ఎంపికలుంటాయని తెలిపారు. 11వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు హ్యాండ్‌బాల్, 12వతేదీ ఉదయం 10 గంటలకు షటిల్ బ్యాడ్మింటన్, 13వతేదీ ఉదయం 10 గంటలకు క్రికెట్ ఎం పికలుంటాయని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఇంటర్ చదువుతూ 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించి ఉండాలని తెలిపారు.

● రేపటి నుంచి మండల స్థాయి ఎంపికలు

ఎస్‌జీఎఫ్ అండర్-17, 14 మండల స్థాయి క్రీడా జట్ల ఎంపికలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి అరిగెల విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం కబడ్డీ, చెస్, యోగా పోటీలు, 9వతేదీన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, 10వతేదీన జడ్పీ పాఠశాలలో ఖోఖో, వాలీబాల్ ఎంపికలుంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత తేదీల్లో హాజరు కావాలని కోరారు.

సీజేపై దాడి అమానుషం

● సీనియర్ న్యాయవాది బద్దేపూడి

నెల్లూరు సిటీ, అక్టోబరు 6,(ఆంధ్రజ్యోతి) : భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి(సీజే) భూషణ రామకృష్ణ గవాయిపై న్యాయవాది దాడికి పాల్పడటం అమానుషమని సీనియర్ న్యాయవాది, ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దేపూడి రవీంద్ర అన్నారు. సోమవారం బుజబుజ నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీజేపై న్యాయవాది ఆటవికంగా వ్యవహరించడం సిగ్గుచేటని, అతనిపై చర్యలు తీసుకోవడమేకాక న్యాయవాద వృత్తి నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



జీఎస్టీ తగ్గింపు..

సాగుకు ఊతం

● నూతన విధానంతో మైక్రో ఇరిగేషన్‌కు ప్రోత్సాహం

పొదలకూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బిందు, తుంపర సేద్యం చేస్తున్న రైతులకు ఇప్పటికే ప్రభుత్వం రాయితీపై పరికరాలు అందచేస్తున్నది. జీఎస్టీ తగ్గడంతో ఈ పరికరాలు మరింత సులభంగా లభించనున్నాయి. ఇన్నాళ్లూ డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలపై 12 శాతం జీఎస్టీ ఉండేది. ఇప్పుడిది ఐదు శాతానికి తగ్గింది. బిందు, తుంపర సేద్యాల సాగు వైపు అన్నదాతలను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఆ ఐదు శాతాన్ని సగానికి తగ్గించింది. ఈ తరహా సేద్యాల పరికరాలపై ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో ఉద్యాన రైతులకు ఉపశమనం కలిగింది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడంతో సూక్ష్మ సేద్యానికి ప్రోత్సాహం లభించింది. కేంద్ర పన్నులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిన మరో రెండున్నర శాతం రైతులకు మరింత ఊతమిచ్చింది. పరికరాల ధరలు తగ్గడంతో బిందు, తుంపర విధానంలో సాగు చేసే రైతులకు ఊరట లభించింది. దీంతో వారు సూక్ష్మ సేద్యం సాగు వైపు దృష్టి మళ్లే అవకాశముంది. అదే జరిగితే సాగునీటి వృధా అరికట్టవచ్చని ఉద్యాన శాఖాధికారులు అంటున్నారు.

జీఎస్టీ తగ్గిన తర్వాత స్ప్రింక్లర్ల ధరలు.. (రూ.లో)

	30 పైపులు		41 పైపులు	
సైజు	తగ్గకముందు	ప్రస్తుతం	తగ్గకముందు	ప్రస్తుతం
63 ఎంఎం	12.591	11,523	17,875	16,359
73 ఎంఎం	14,216	13,010	20,098	18,393
90 ఎంఎం	19,436	17,787	26,971	24,684
110 ఎంఎం	38,308	35,059	53,136	48,629

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● కలెక్టరు హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం),అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, యూరియా అక్రమ నిల్వలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అంతర్గత తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని గోదాములు, డీలర్ల దుకాణాలు, ఇతర ప్రదేశాల్లో నిల్వ చేసిన ఎరువులు, రికార్డులను క్రమ పద్ధతిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతాంగానికి అవసరమైన ఎరువులను సమయానికి అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. ఎరువుల అనధికార విక్రయాలు, నకిలీ విత్తనాలు, అనుమతులు లేని పురుగు మందుల విక్రయాలు, అధిక ధరలకు విక్రయించడం తదితర అవకతవకలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. లైసెన్సులు రద్దు చేయడంతోపాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టరు హెచ్చరించారు. వీటిపై ఫిర్యాదులు చేయాలంటే ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరు 83310 57285ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా ఈ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

రాళ్లపాడులో మృతదేహం వెలికితీత



రాళ్లపాడు ప్రాజెక్టులో మృతదేహాన్ని బయటకు తీసుకు వస్తున్న ఎస్‌ఐ నారాయణ, గజ ఈతగాళ్లు

లింగసముద్రం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో ఆదివారం రాత్రి గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం ఉదయం పోలీసులు బయటకు తీయించారు. ఎస్‌ఐ ఎం.నారాయణ, కొందరు గజ ఈతగాళ్లు పడవలో ప్రాజెక్టు గేట్ల వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తెచ్చారు. సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగిన మృతుడు గుండు గీయించుకొని ఉన్నాడు. మృతదేహాన్ని కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు 9121102217 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై

రేపు అవగాహన సదస్సు



విలేకరులతో మాట్లాడుతున్న ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సేల్స్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ యాలమూరి రంగయ్య నాయుడు, వైస్ చైర్మన్ డాక్టర్ ఏవీఎస్ కృష్ణమోహన్‌రావు, ఈసీ మెంబరు ఎస్వీ రమేష్‌బాబు, ఎన్ బలరామయ్య నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం నెల్లూరులోని ముత్తుకూరు రోడ్డులో ఉన్న పీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని, పారిశ్రామిక, వర్తక, వాణిజ్య వేత్తలు, వినియోగదారులు విజయవంతం చేయాలని కోరారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ వై కిరణ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ ఎం సత్యప్రకాష్ హాజరవుతారని చెప్పారు. తగ్గించిన జీఎస్టీ రాయతీలు ప్రజలందరికీ అందించేలా కృషి చేస్తామని తెలిపారు.

లీకేజీ నీటితో ఇక్కట్లు

● తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి స్టేషన్ పైపులైన్ నీరు

● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ప్రజలు

కావలి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా... ఎవరికైనా సమస్య ఇస్తే... పరిష్కారం కోసం పోలీసుల వద్దకు వెళ్లతాం. కానీ పోలీసుల వల్లే ఇబ్బందులు ఎదురైతే ఎవరి వద్దకు వెళ్లాలి...? ఇలాంటి సమస్యే రెవెన్యూ అధికారులు, పోలీసుల మధ్య ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి పైపులైన్ లీకై తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి నీరు వస్తోంది. పైపులైన్లు లీక్ కావటం సహజమే కానీ.. దాన్ని మరమ్మతులు చేసుకోవాల్సి ఉన్నా, పోలీసులు పట్టించుకోవడంలేదు. సుమారు నెల రోజులుగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి పోలీస్‌స్టేషన్ నుంచి నీరు వస్తూ ఆవరణమంతా మురుగునీటి మడుగుగా తయారైంది. ఒక్క తహసీల్దార్ కార్యాలయమే కాకుండా సబ్‌రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ఆయా కార్యాలయాలకు రాకపోకలు సాగించే ప్రజలు సైతం ఆ మురుగునీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సిందే. ప్రజలకు ఎంతో ఇబ్బంది కరంగా మురుగునీటి మడుగు ఉన్నా అధికారులు పట్టించుకోవటంలేదు, మురుగునీరు తహసీల్దార్ కార్యాలయంలో ఉండటంతో అందరూ రెవెన్యూ అధికారులను మురుగునీరు అలా ఉంటే రాకపోకలు ఎలా సాగించాలని అడుగుతున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ నీరు పోలీస్‌స్టేషన్ నుంచి వస్తున్నాయని ఎక్కడో పైపులైన్ లీక్ అయినట్లు ఉందని వారికి చెప్పినా స్పందించటంలేదని చెబుతున్నారు. తామే మరమ్మతులు చేద్దామంటే ఆ పైపులైన్ లీక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉందంటున్నారు. సమాజంలో ప్రజాదరణలో ఉన్న పోలీస్, రెవెన్యూశాఖలే నీటి మడుగు సమస్యను పరిష్కరించకపోతే ప్రజలకు, ఉద్యోగులకు విముక్తి ఎలా కలుగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి మడుగుతో రాకపోకలకు అడ్డుగా పెట్టిన దుంగలు





తహసీల్దార్ కార్యాలయం ముందు ఏర్పడిన మురుగునీటి మడుగు, పోలీస్ స్టేషన్ గోడలో నుంచి వస్తున్న నీరు

ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా

115 బస్సులపై కేసుల నమోదు

వెంకటాచలం, అక్టో బరు 6 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై రవా ణా శాఖాధికారులు కొరడా ఝుళిపించారు. వె ంకటాచలం సమీపంలో ని టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి డీటీసీ బీ చందర్ స్వయంగా ఆర్టీఏ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక చార్జీలు వసూలు చేసిన 105 బస్సులు, ఓవర్ లోడ్ 9, సరైన పత్రాలు లేని ఒక బస్సు.. మొత్తం 115 ప్రైవేటు ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. దీంతో రూ.11.41 లక్షల అపరాధ రుసుమును విధించారు. దసరా పండుగకు వచ్చి తిరిగి వారి స్వస్థలాలకు భారీ సంఖ్యలో వెళ్తున్న ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై ఉక్కుపాదం మోపా రు. ఒకేసారి 115 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. డీటీసీ చందర్ మాట్లాడుతూ దసరాకి సొంత ఊళ్లకు వచ్చి వెళ్లే వారి దగ్గరి నుంచి భారీగా ప్రైవేటు ట్రావెల్స్ వారు రవాణా చార్జీలు వసూలు చేస్తున్నట్లు రవాణా శాఖ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారన్నారు. నిబంధనలు అతిక్రమించి అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. జిల్లాలో తనిఖీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో బ్రేక్ ఇన్స్పెక్టర్లు మురళీమోహన్, షఫీ, ఆర్టీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ జరిపి, న్యాయం చేస్తాం : ఎస్పీ



దివ్యాంగుడి వద్దకు వచ్చి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 121 మంది బాధితులు తరలివచ్చి ఎస్పీకి ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించి అర్జీలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు క్రికెట్‌లో సెమీస్‌కు జిల్లా జట్టు



సెమీస్‌కు చేరుకున్న నెల్లూరు జట్టు

నెల్లూరు (విద్య), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో జరుగుతున్న జేశాప్ జర్నలిస్టుల రాష్ట్ర క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు కర్నూలు జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్స్ కు చేరుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు మాత్రమే చేయడంతో 27 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించిందని జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు నందకిషోర్, సునీల్ తెలిపారు.

'ఉపాధి' అవినీతిపై పునర్విచారణకు ఆదేశాలు

కలువాయి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోపవరం పంచాయతీలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతి వ్యవహారంపై షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ ఆదేశాల మేరకు పునర్ విచారణ చేసి 15 రోజుల్లో నివేదిక అందించాలని జిల్లా ఎస్పీ, డ్వామా పీడీ, జిల్లా పంచాయతీ అధికారులకు కలెక్టర్ సోమవారం ఆదేశాలు ఇచ్చారు. చిన్నగోపరంలో ఎస్సీ, ఎస్టీ, ఇతరుల ఉపాధి జాబ్‌కార్డుల్లో గ్రామానికి సంబంధం లేని పలువురు పేర్లు చేర్పించి, ఉపాధి నిధులను భారీగా స్వాహా చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపారు. ఈ విచారణలో దోషులుగా తేలడంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారంపై తాజాగా కొందరు షెడ్యూలు కులాల జాతీయ కమిషన్ (హైదరాబాదు)కు ఫిర్యాదు చేయడంతో పునర్ విచారణకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

బ్రాహ్మణక్రాక పంచాయతీ విభజనపై గ్రామసభ



గ్రామసభకు హాజరైన బ్రాహ్మణక్రాక పంచాయతీ ప్రజలు

జలదంకి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మేజర్ పంచాయతీ బ్రాహ్మణక్రాక విభజనపై సోమవారం పంచాయతీ కార్యదర్శి నీరజ గ్రామసభ నిర్వహించారు. బ్రాహ్మణక్రాక-1 సచివాలయ ప్రాంగణంలో సర్పంచు ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు వార్డుసభ్యులు, పంచాయతీలోని బీకే అగ్రహారం, హనుమకొండపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు తమకు ప్రత్యేకంగా పంచాయతీ కావాలని ఆకాంక్షించారు. వీరి కోరికల మేరకు డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీలకు గ్రామసభ తీర్మానాలకు నివేదిస్తామని కార్యదర్శి నీరజ తెలిపారు. కాగా బీకే అగ్రహారంను పంచాయతీ చేసే విషయమై ఆ గ్రామస్థులు, వార్డుసభ్యులు ఒక్కటిగా ఉండగా హనుమకొండపాలెం విషయంలో అక్కడి ప్రజల మధ్య భిన్న అభిప్రాయాలు గ్రామసభలో వ్యక్తమయ్యాయి. గ్రామసభలో ఉపసర్పంచు దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, పున్నం రోశిరెడ్డి, లింగంగుంట కృష్ణయ్యనాయుడు, స్వర్ణ కొండపనాయుడు, కంచర్ల వెంకప్పనాయుడు, కంచర్ల మురళీనాయుడు, మారెళ్ల బ్రహ్మారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు వాల్మీకి జయంతి

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో మంగళవారం ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ తిక్కనభవన్‌లో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా

సమస్యను పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా ప్రతి సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఏశాఖ పరిధిలో కూడా అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని ఆదేశించారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలలో అర్జీల స్టేటస్ పరిశీలించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భూసమస్యలు ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. వాటిని పరిష్కరించే దిశగా అధికారులు శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందిన వినతుల్లో కొన్ని...

● గొలగమూడి వెంకయ్య స్వామి ఆశ్రమాన్ని కాపాడుతున్న ఈవో బాలసుబ్రహ్మణ్యంకు ప్రభుత్వం అండగా నిలవాలని బీజేపీ నేత మిడతల రమేష్, జిల్లా అభివృద్ధి సంస్థ సభ్యుడు పోట్లూరు శ్రీనివాసులు, వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి ఏవీఆర్ మోహన్‌రావు, ఏపీ తీరప్రాంత మత్స్యకార పరిరక్షణ సమితి ఫౌండర్ చిట్టిబాబు, జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ యాదవ్, కోవూరు బీజేపీ నేత సోమగోపాల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈవోపై ఆరోపణలు చేయటం సరికాదని, ప్రభుత్వం ఆయనకు అండగా నిలవాలని కోరారు.


● దగదర్తి మండలం ఉలవపాళ్లలో మాదిగలకు ఇచ్చిన భూములకు పట్టా ఉన్నా, లేకపోయినా అందరికీ ఇచ్చినట్లుగా పరిహారం సమానంగా ఇవ్వాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ జేసీకి వినతిపత్రం అందచేశారు.

● నెల్లూరు ఐటీడీఏ కార్యాలయంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళీ కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

● దివ్యాంగుల కోసం ప్రత్యేక పీజీఆర్ఎస్‌ను ఏర్పాటుచేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● కాకుటూరు పంచాయతీలో ఉన్న రఘువీర్ రియల్ ఎస్టేట్ స్థలాలను కాపాడాలని ఆ లేఅవుట్ స్థల యజమానులు కృష్ణారెడ్డి, రవికుమార్, మనోహర్, ఆదిశేషయ్య కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు.

● నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొలగమూడి ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యంకు అండగా చేనేత పద్మశాలి సంఘం ఉంటుందని సోమవారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కలెక్టర్ పీఏకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమగోపాల్, ఉపాధ్యక్షుడు కొప్పర్తి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ పీఏకి వినతిపత్రం అందచేస్తున్న చేనేత సంఘం నాయకులు